


కల చెదిరింది

నిరాశలో నగరి ప్రజలు
వెంకటగిరి నిర్ణయం మీదా అసంతృప్తి
దిక్కుతోచని స్థితిలో నేతలు
● గూడూరు గుండె బద్దలైంది



గూడూరును ప్రత్యేక జిల్లాగా చేయకపోతే పోయారు.. కనీసం నెల్లూరుజిల్లాలో అయినా కలుపుతారని నమ్మిన ప్రజలు దిగ్భ్రాంతికి గురవుతున్నారు. నెల్లూరులో మళ్లీ విలీనం అయినట్టే అని రెండు రోజుల ముందు దాకా బలంగా ప్రచారం కూడా జరిగింది. నగరి నియోజకవర్గంలోని మూడు మండలాలను కూడా తిరుపతిలో కలుపుతారని ఆశ పడ్డారు. హఠాత్తుగా కథ ఎందుకు అడ్డం తిరిగిందో అర్థం కాక అందరూ సతమతమవుతున్నారు. జగన్ ప్రభుత్వంలో జరిగిన అవకతవకల నిర్ణయాన్ని చంద్రబాబు సరిదిద్దుతారని ఆశపడ్డ ప్రజలు మరోసారి తీవ్ర నిరాశకు గురవుతున్నారు. పైగా వెంకటగిరి నియోజకవర్గంలో సుదూరంగా ఉండే మూడు మండలాలను తిరుపతిలో విలీనం చేయడం కూడా అక్కడి ప్రజలకు నచ్చడం లేదు. ఈ అసంతృప్తిని ఎలా ఎదుర్కోవాలో కూటమి నాయకులకు కూడా అంతుపట్టడం లేదు. ఈ నిర్ణయాలను పునఃసమీక్షించుకుని సరిదిద్దాలని ప్రజలు కోరుతున్నారు.

తిరుపతి/గూడూరు/వెంకటగిరి/నగరి, ఆంధ్రజ్యోతి

భగ్గుమంటున్న గూడూరు

అధికారంలోకి రాగానే గూడూరు నియోజకవర్గాన్ని నెల్లూరుజిల్లాలో కలుపుతాం

- 2023 జూన్‌లో కోటలో జరిగిన యువగళం బహిరంగ సభలో నారా లోకేశ్ హామీ ఇచ్చారు.
- 2024 ఏప్రిల్ 20న ఎన్నికల సందర్భంగా గూడూరులో నిర్వహించిన మహిళా సదస్సులో సీఎం చంద్రబాబునాయుడు కూడా సభాముఖంగా ఇదే ప్రకటన చేశారు.
- స్థానిక ఎమ్మెల్యే పాశం సునీల్‌కుమార్ కూడా అంశాన్ని ప్రజల ఆకాంక్షగా అసెంబ్లీలో ప్రస్తావించారు.
- నూతన జిల్లాల ఏర్పాటు, మండలాల పునర్విభజన ప్రక్రియపై చేసిన మథనం తర్వాత గూడూరు నియోజకవర్గాన్ని నెల్లూరుజిల్లాలోనే విలీనం చేయాలని మంత్రివర్గ ఉప సంఘం ఇటీవల ప్రతిపాదించింది.

ఏం జరిగిందో ఏమో కానీ, గూడూరు ప్రాంత ప్రజల కల చెదిరింది. కన్నీరు మిగిలింది.

ప్రభుత్వానికి విన్నవించా

'గూడూరు నియోజకవర్గాన్ని నెల్లూరు జిల్లాలో కలపాలని ప్రభుత్వానికి మెయిల్ ద్వారా వినతిపత్రం పంపా. వైసీపీ ప్రభుత్వం గూడూరును తిరుపతి జిల్లాలో కలపంతో కలపడంతో ఇబ్బంది పడుతున్న ప్రజలు.. నెల్లూరుజిల్లాలోనే కలపాలని కోరుతున్నారు. దీనిపై చంద్రబాబు, లోకేశ్ కూడా హామీ ఇచ్చారు. అసెంబ్లీ సమావేశాల్లోనూ ప్రజల గళాన్ని వినిపించా. అందరి అభ్యర్థనను సీఎం చంద్రబాబు పరిగణనలోకి తీసుకుని, గూడూరు నియోజకవర్గాన్ని నెల్లూరుజిల్లాలో కలపాలని విన్నవించా'నని ఎమ్మెల్యే పాశం సునీల్‌కుమార్ తెలిపారు.

గూడూరు నియోజకవర్గంలోని గూడూరు, చిల్లకూరు, కోట, వాకాడు, చిట్టమూరు మండలాల నుంచి 40 కిలోమీటర్ల లోపు దూరంలో నెల్లూరు ఉంటుంది. 30 నుంచి 40 నిమిషాల సమయంలో నెల్లూరుకు చేరుకోవచ్చు. జిల్లా కేంద్రంతో ఈ ప్రాంతం పెనవేసుకుని ఉండేది. గత వైసీపీ ప్రభుత్వం జిల్లాల పునర్విభజనలో భాగంగా 2022 ఏప్రిల్ నెలలో గూడూరు నియోజకవర్గాన్ని నెల్లూరు జిల్లా నుంచి విడదీసి నూతనంగా ఏర్పాటు చేసిన తిరుపతి జిల్లాలో విలీనం చేసింది. ఈ ప్రాంతాల నుంచి తిరుపతి జిల్లా కేంద్రానికి వెళ్లాలంటే 100 నుంచి 110 కిలోమీటర్ల వరకు.. 2 గంటలకుపైగా ప్రయాణం సాగించాలి. నెల్లూరు కంటే తిరుపతికి ప్రయాణ ఖర్చులు ఎక్కువ. నియోజకవర్గం నుంచి తిరుపతి జిల్లా కేంద్రంలో ప్రభుత్వ కార్యాలయాలకు వెళ్లాలంటే ఇటు ప్రజలు, అటు ఉద్యోగులు, వ్యాపారులు ఇబ్బందులు పడాల్సివచ్చేది. అప్పట్లో ఈ నిర్ణయాన్ని నియోజకవర్గ ప్రజలు వ్యతిరేకిస్తూ పెద్దఎత్తున నిరసన కార్యక్రమాలను చేపట్టినా వైసీపీ ప్రభుత్వం పట్టించుకోలేదు. ఎన్నికల్లో అందుకు తగిన మూల్యాన్ని ఆ పార్టీ చెల్లించుకోవాల్సి వచ్చింది. కూటమి ప్రభుత్వం ఈ తప్పును సరిదిద్దుతుందని ప్రజలు ఆశించారు. నెల్లూరులో కలపడం కాదు ప్రత్యేక జిల్లానే కావాలని డిమండ్‌ను తెరమీదకు తెచ్చారు. అయితే ఇప్పుడు మొదటికే మోసం వచ్చింది. ఇదిగో అయిపోయింది.. అదిగో పూర్తయ్యిందని ఇప్పటిదాకా ప్రజలకు నచ్చజెప్పుతూ వచ్చిన కూటమి నాయకులంతా ఇప్పుడేమి చెప్పాలా అని ఆందోళన చెందుతున్నారు. అధినేతా, యువనేతా ఇచ్చిన హామీలకే దిక్కులేకపోతే ఇక తమ మాటలను ప్రజలేం నమ్ముతారనే ఆవేదన కొందరు వ్యక్తం చేస్తున్నారు. సీఎం చంద్రబాబు, నారా లోకేశ్‌లు స్థానిక ప్రజల ఆకాంక్షలను పట్టించుకుని పునరాలోచించాలని కోరుతున్నారు. నెల్లూరులో కలపాలని కోరుతున్నారు.

అసంతృప్తిని మిగిల్చింది!



గూడూరును నెల్లూరు జిల్లాలో విలీనం చేస్తారని ఇక్కడి ప్రజలు ఎంతో ఆశగా వున్నారు. ప్రభుత్వ నిర్ణయం ప్రజలు, ఉద్యోగులు, ఉపాధ్యాయులు, వ్యాపారులకు తీవ్ర అసంతృప్తిని మిగిల్చింది.

- వై.సుబ్రమణ్యం రాజు, ఏపీటీఎఫ్ గౌరవాధ్యక్షుడు

నెల్లూరుతోనే మా అనుబంధం



రోజువారీ విద్య, వైద్యం, వ్యాపారాలపరంగా నెల్లూరుతో మా అనుబంధం ముడిపడివుంది. తిరుపతి జిల్లాలో కొనసాగించడం ప్రజలను తీవ్ర అసంతృప్తికి గురి చేస్తోంది. గూడూరును నెల్లూరు జిల్లాలో విలీనం చేయాలి.

- నల్లారెడ్డి రాజేష్‌రెడ్డి, సర్పంచ్, అరవపాలెం, చిట్టమూరు మండలం

హామీ నెరవేర్చండి



ఎన్నికల సమయంలో చంద్రబాబునాయుడు ఇచ్చిన హామీని నెరవేర్చాలి. గూడూరు ఎన్నో ఏళ్లుగా నెల్లూరుజిల్లాలో భాగంగానే ఉంది. ప్రజల ఆకాంక్షను నెరవేర్చేలా ప్రభుత్వం పునరాలోచన చేసి నెల్లూరులో కలిపేలా చర్యలు తీసుకోవాలి.

- జీ శశికుమార్, సీపీఐ నాయకుడు

నగరి నిర్ణయం తప్పే!

నగరి నియోజకవర్గంలో ఐదు మండలాలుంటే అందులో నగరి, నింద్ర, విజయపురం మండలాలు మూడు చిత్తూరు జిల్లాలోనూ, పుత్తూరు, వడమాలపేట మండలాలు తిరుపతి జిల్లాలోనూ వున్నాయి. నగరి నుంచి చిత్తూరుకు 75 కిలోమీటర్లు కాగా తిరుపతి 60 కిలోమీటర్లు. నింద్ర, విజయపురాల నుంచి చిత్తూరు 90 కిలోమీటర్లుంటే తిరుపతి 80 కిలోమీటర్లు. చిత్తూరుతో పోలిస్తే తిరుపతి వీరికి చేరువ. రవాణా సదుపాయాలు మెరుగ్గా వున్నాయి. ఈ మూడు మండలాల ప్రజలు విద్య, వైద్య అవసరాలకు చిత్తూరు కంటే తిరుపతిపై ఎక్కువ ఆధారపడుతున్నారు. దీనికి తోడు గత ఎన్నికల ప్రచారంలో చంద్రబాబు, లోకేశ్, గాలి భానుప్రకాష్. నగరి నియోజకవర్గాన్ని పూర్తిగా తిరుపతి జిల్లాలో విలీనం చేస్తామని హామీలిచ్చారు. ఆ హామీలను నెరవేర్చకపోవడం పట్ల మూడు మండలాల ప్రజలు తీవ్ర నిరాశకు లోనవుతున్నారు. ప్రజలకు ఏం చెప్పుకోవాలో తెలీక టీడీపీ శ్రేణులు సైతం నైరాశ్యంలో పడ్డాయి.

ఇచ్చిన హామీ నిలబెట్టుకోవాలి



నగరి, పుత్తూరు ప్రాంతాల్లో జరిగిన ఎన్నికల సభల్లో చంద్రబాబు, లోకేశ్, గాలి భానుప్రకాష్ మూడు మండలాలను తిరుపతి జిల్లాలో కలుపుతామని హామీ ఇచ్చారు. ఎన్నికల సమయంలో ఓట్ల కోసం హామీ ఇచ్చి, అధికారంలోకి వచ్చాక తప్పడం దారుణం. హామీ నిలబెట్టుకోవాలి.

- గణేష్ పిళ్లై, విశ్రాంత ఉద్యోగి, నింద్ర

పునఃపరిశీలన చేయాలి



నగరి, నింద్ర, విజయపురం మండలాలను తిరుపతిలో కలపే అంశాన్ని ప్రభుత్వ పెద్దలు పునఃపరిశీలన చేయాలి. లేకుండా విద్యార్థులకు, ఉద్యోగులకు ఎక్కువ ఇబ్బంది అవుతోంది.

- సమరసింహారెడ్డి, మల్లాకంద్రిగ, విజయపురం మండలం

తిరుపతే అన్నిరకాలుగా సౌకర్యం



నగరి ప్రాంతం తిరుపతికి రైలు సౌకర్యంతో పాటు ప్రతి 15 నిమిషాలకో బస్సు ఉంది. రవాణా సౌకర్యంతో పాటు విద్య, వైద్య సౌకర్యాలు కూడా తిరుపతిలోనే బాగున్నాయి. ఈ మూడు మండలాల ప్రజలకు తిరుపతితోనే అనుబంధం ఉంది. చిత్తూరుకు వెళ్లాలంటే నానా అవస్థలు పడాలి.

- ఈఎన్ శ్రీనివాసులు, కేవీపీఆర్‌పేట, నగరి మండలం

ఎవరడిగారని తిరుపతిలో విలీనం?

నెల్లూరు జిల్లాలో వున్న వెంకటగిరి నియోజకవర్గానికి చెందిన కలువాయి, సైదాపురం, రాపూరు మండలాలను తిరుపతిలో విలీనం చేయనుండడం పట్ల అక్కడి ప్రజల్లో తీవ్ర అసంతృప్తిని రాజేస్తోంది. వాస్తవానికి ఈ మూడు మండలాల విషయంలో సీఎం చంద్రబాబు గానీ, మంత్రి లోకేశ్ గానీ గత ఎన్నికల్లో ఎలాంటి హామీలూ ఇవ్వలేదు. దానికి తోడు ఈ మూడు మండలాల ప్రజలు గానీ, కూటమి పార్టీల శ్రేణులు గానీ తిరుపతి జిల్లాలో కలపాలని కోరలేదు. ఎలాంటి డిమాండు లేకున్నా నెల్లూరు పరిధిలోని మూడు మండలాలను గూడూరు డివిజన్‌లో కలపడం అక్కడి ప్రజలను విస్మయానికి గురి చేస్తోంది. దూరాభారాల విషయంలో ఈ మూడు మండలాల ప్రజలు ప్రభుత్వ తాజా నిర్ణయంతో తీవ్ర అసౌకర్యానికి గురి కావాల్సి ఉంటుంది. కలువాయి, సైదాపురం, రాపూరు మండలాలు నెల్లూరుకు చేరువగా వున్నాయి. అదే తిరుపతి అయితే రెట్టింపు కంటే ఎక్కువ దూరం. ఉదాహరణకు కలువాయి నుంచి నెల్లూరుకు 70 కిలోమీటర్లు కాగా తిరుపతి ఏకంగా 160 కిలోమీటర్ల దూరంలో వుంది. అలాగే రాపూరు నుంచి నెల్లూరు 60 కిలోమీటర్లు అయితే తిరుపతి 90 కిలోమీటర్లు. సైదాపురం నుంచి నెల్లూరు 50 కిలోమీటర్ల దూరాన వుంటే తిరుపతి ఏకంగా 130 కిలోమీటర్ల దూరంలో వుంది. డివిజన్ విషయంలో కూడా ఈ మండలాలకు గూడూరు కంటే ఇపుడున్న నెల్లూరే చేరువ.

నెల్లూరులోనే కొనసాగించాలి!



నెల్లూరు జిల్లా ఏర్పడినప్పటి నుంచీ అందులోనే ఉన్నాం. నెల్లూరుతో యాస, భాషతో పాటు అన్ని రకాలుగా ప్రత్యేక అనుబంధం ఏర్పడిపోయింది. అలాంటిది ఇప్పుడు విడదీయం తగదు.

- ఇస్కా రమణయ్య, లారీ యజమాని, రాపూరు

మాకు తిరుపతి వద్దు



సైదాపురం మండలాన్ని తిరుపతి జిల్లాలో కలపడం వల్ల సామాన్య ప్రజలు ఇబ్బందులకు గురవుతారు. మాకు అన్ని విధాలా నెల్లూరే అనుకూలం. కాబట్టి నెల్లూరు జిల్లాలోనే కొనసాగించాలి.

- డి.వెంకటేశ్వర్లు, సైదాపురం

రైతులకు కష్టం



కలువాయి మండలం ఇప్పుడు ఆత్మకూరు డివిజన్‌లో ఉంది. కలువాయి నుంచి ఆత్మకూరుకు 50 కిలోమీటర్లు. గూడూరు డివిజన్‌లో కలిపితే 80 కిలోమీటర్లు ప్రయాణించాలి. పనుల మీద తిరిగే రైతులు రానూపోనూ 60 కిలోమీటర్లు అదనంగా ప్రయాణించాలి. జిల్లా కేంద్రం తిరుపతికి పోవాలంటే 160 కిలోమీటర్లు ప్రయాణించాలి.

- నాగిరెడ్డి రాజగోపాల్‌రెడ్డి, సింగిల్‌విండో మాజీ ఛైర్మన్, కలువాయి

నేడు సీఎంతో టీటీడీ ఛైర్మన్, ఈవో భేటీ
టీటీడీ అభివృద్ధి కార్యక్రమాలపై సమీక్ష

తిరుమల, నవంబరు26(ఆంధ్రజ్యోతి): అమరావతిలో గురువారం సీఎం చంద్రబాబును టీటీడీ ఛైర్మన్ బీఆర్ నాయుడు, ఈవో అనిల్ కుమార్ సింఘాల్, అదనపు ఈవో వెంకయ్య చౌదరి కలవనున్నారు. ఇక్కడి వెంకటపాలెంలోని శ్రీవేంకటేశ్వరస్వామి ఆలయం ప్రాకారం, కల్యాణోత్సవ మండపం, రాజగోపురం తదితర అభివృద్ధి కార్యక్రమాలకు గురువారం ప్రత్యేక పూజలు నిర్వహించనున్నారు. అనంతరం సీఎంతో వీరు భేటీ అవుతారు. గతంలో సీఎం సూచించిన అభివృద్ధి కార్యక్రమాల పురోగతి, భవిష్యత్తులో చేపట్టాల్సిన కార్యక్రమాలు, వైకుంఠ ఏకాదశి ఏర్పాట్లు వంటి వివిధ అంశాలపై ఈ సందర్భంగా సీఎం సమీక్షిస్తారు.

15 నుంచీ ప్రి-పీహెచ్‌డీ పరీక్షలు

తిరుపతి (విశ్వవిద్యాలయాలు), నవంబరు 26 (ఆంధ్రజ్యోతి): వచ్చే నెల 15 నుంచీ ఎస్వీయూలో ప్రి-పీహెచ్‌డీ పరీక్షలు నిర్వహిస్తారు. ఉదయం 9 నుంచీ 12 గంటల వరకూ ఈ పరీక్షలు చేపడతారు. 15 న రీసెర్చ్ మెథడాలజీ, 17 న రీసెర్చ్ టాపిక్ పరీక్షలు నిర్వహించనున్నట్టు సీఈ రాజమాణిక్యం తెలిపారు.

దూరవిద్యా డిగ్రీ మూడో సంవత్సర ఫలితాలు విడుదల

ఎస్వీయూ దూరవిద్యా డిగ్రీ మూడో సంవత్సర ఫలితాలు విడుదలయ్యాయి. ఎస్వీయూ. ఎగ్జామ్. ఎడ్యు. ఇన్, మనబడి, స్కూల్స్9 వెబ్ సైట్లలో ఫలితాలను పొందుపర్చినట్టు సీఈ తెలిపారు.

ట్యాంకరు ఎలా పేలింది?

● 'సుధా సోమానీ'లో ప్రమాదంపై అధికారుల దర్యాప్తు
● ఘటనలో ఇద్దరు కార్మికుల మృతి.. మరో ఇద్దరికి గాయాలు


పేలిన ట్యాంకు


పోతురాజు మృతదేహం


అరవింద పాండే మృతదేహం


పరిశ్రమలో ట్యాంకు పేలిన ప్రదేశం

శ్రీకాళహస్తి, నవంబరు 26(ఆంధ్రజ్యోతి): 'సుధా సోమానీ' పరిశ్రమలో నైట్రోజన్ ట్యాంకరు ఎలా పేలింది.. దీనిపై అధికారులు దర్యాప్తు చేపట్టారు. శ్రీకాళహస్తి మండలం వెల్లంపాడులోని ఈ కర్మాగారంలో బుధవారం నాటి ప్రమాదంలో ఇద్దరు కార్మికులు మృతిచెందగా, మరో ఇద్దరు గాయపడ్డారు. క్రయోజనిక్ ప్రొఫైన్ ఖాళీ ట్యాంకులో నైట్రోజన్ నింపుతుంటామని పరిశ్రమ నిర్వాహకులు అధికారులకు వెల్లడించినట్లు తెలిసింది. బుధవారం ఖాళీ ట్యాంకర్‌ను టెస్టింగ్ చేస్తుండగా పేలుడు జరిగినట్లు అధికారులకు వివరించారు. ఖాళీ ట్యాంకర్ అంత అధిక పీడనంతో ఎందుకు పేలిందనే సందేహాన్ని అధికారులు వ్యక్తం చేస్తున్నారు. నైట్రోజన్ ట్యాంకులో నింపుతూ ప్రెజర్‌లో టెస్టింగ్ చేసే సమయంలో అధిక ఒత్తిడి కారణంగా ప్రమాదం జరిగిందా అనే కోణంలో దర్యాప్తు చేస్తున్నారు. మరింత లోతుగా దర్యాప్తు చేసి పేలుడు కారణాలు వెల్లడిస్తామని పోలీసులు తెలిపారు.

ఏం జరిగింది? : శ్రీకాళహస్తి మండలం వెల్లంపాడులో సుధా సోమానీ సిరామిక్ కర్మాగారంలో టైల్స్, బాత్‌రూం పరికరాలను తయారు చేస్తుంటారు. 50 ఎకరాల విస్తీర్ణంలోని ఈ పరిశ్రమంలో సుమారు 500 మంది సిబ్బంది ఉదయం 7 గంటలు, సాయంత్రం 7గంటలకు రెండు షిఫ్టుల్లో పనిచేస్తున్నారు. బుధవారం ఉదయం 11.30గంటల సమయంలో క్రయోజనిక్ ప్రొఫైన్ ట్యాంకు పేలడంతో నలుగురు తీవ్రంగా గాయపడ్డారు. వీరిని వెంకటగిరి ప్రభుత్వ ఏరియా ఆస్పత్రికి తరలించగా చీరాలకు చెందిన పోతురాజు(31), ఒడిశాకు చెందిన అరబింద పాండా(25) మృతి చెందినట్లు వైద్యులు ధ్రువీకరించారు. చంద్రగిరికి చెందిన బాలాజీ, ఒడిస్సాకు చెందిన సౌభాగ్య నాయక్ అలియాస్ రంజన్ నాయక్ తీవ్రంగా గాయపడ్డారు. వీరిని మెరుగైన చికిత్స నిమిత్తం తిరుపతి రుయాస్పత్రికి తరలించారు. మృతుల కుటుంబాలకు రూ.25లక్షలు చొప్పున యాజమాన్యం నష్టపరిహారం చెల్లించాలని సీపీఐ ఏరియా కార్యదర్శి జనమాల గురవయ్య డిమాండు చేశారు. ప్రమాదాలు జరగకుండా అధికారులు పటిష్టమైన చర్యలుచేపట్టాలని కోరారు.

ప్రమాద స్థలం పరిశీలన : ఈ ప్రమాదం తెలిసిన వెంటనే శ్రీకాళహస్తి డీఎస్పీ నరసింహమూర్తి, సీఐ నాగార్జునరెడ్డి వెంకటగిరి ప్రభుత్వ ఆస్పత్రికి చేరుకుని క్షతగాత్రులతో మాట్లాడారు. మృతుల కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. మృతదేహాలను పోస్టుమార్టం నిమిత్తం వెంకటగిరి ప్రభుత్వాస్పత్రి మార్చ్యురీకి తరలించారు. అనంతరం డీఎస్పీ సిబ్బందితో కలిసి పరిశ్రమలో ఘటన సంభవించిన ప్రాంతానికి చేరుకుని విచారించారు.ఇంటెలిజెన్స్ స్పెషల్ బ్రాంచి సిబ్బంది పేలిన ట్యాంకర్ పరిసరాలను పరిశీలించారు. తిరుపతి నుంచి క్లూస్ టీం చేరుకుని పేలుడు ప్రదేశంలో మృతుల రక్తపు జాడలు, పలు నమూనాలను సేకరించారు.

అధ్యక్షా..

● రాష్ట్రస్థాయి మాక్ అసెంబ్లీలో మన విద్యార్థుల ప్రతిభ



రైతే రాజయ్యేలా ప్రభుత్వం చర్యలు తీసుకుంటోంది. మంచి దిగుబడి ఇచ్చే విత్తనాలను పంపిణీ చేస్తాం. మంథా తుఫానువల్ల వరదలు వచ్చిన ప్రాంతాల్లో తక్షణ సహాయక చర్యలు చేపట్టి నష్టపరిహారం చెల్లించాం.

- వ్యవసాయ శాఖ మంత్రిగా గూడూరు జడ్పీ బాలుర పాఠశాల విద్యార్థి సాగర్ కుమార్.

పుస్తకాల బరువు తగ్గిస్తాం. సెమిస్టర్ సిస్టం అమలు చేస్తాం. పాఠశాలలను డ్రగ్స్‌రహితంగా చేస్తాం. అందుకు అవసరమైన ప్రణాళికను రచించాం.

- రాష్ట్ర విద్యాశాఖ మంత్రిగా తిరుచానూరు జడ్పీహెచ్ఎస్ విద్యార్థిని చిన్మయి విద్య.



- ఇలా మన జిల్లాకు చెందిన విద్యార్థులు బుధవారం విజయవాడలో జరిగిన రాష్ట్రస్థాయి మాక్ అసెంబ్లీలో మంత్రులుగా వ్యవహరిస్తూ.. తమ వాగ్ధాటితో అందరి ప్రశంసలు అందుకున్నారు. విద్యార్థులపై సోషల్ మీడియా చెడు ప్రభావం పడకుండా ప్రత్యేకంగా రూపొందించిన బిల్లును చిన్మయి ప్రవేశపెట్టారు. ఇక, తిరుపతి నెహ్రూ మున్సిపల్ హైస్కూల్ విద్యార్థిని భవ్యశ్రీ ప్రతిపక్ష సభ్యునిగా.. సైదాపురం జడ్పీహెచ్ఎస్ విద్యార్థి వెంకట దినకర్ మార్షల్ పాత్ర పోషించారు. కార్యక్రమం అనంతరం వీరిని మంత్రి నారా లోకేశ్ తదితరులు ప్రశంసించారు.

- తిరుపతి(విద్య), ఆంధ్రజ్యోతి

జిల్లా స్థాయిలోనూ మాక్ అసెంబ్లీ

తిరుపతి/తిరుపతి (విద్య), నవంబరు 26(ఆంధ్రజ్యోతి): తిరుపతిలోని తుడా కార్యాలయంలో బుధవారం రాజ్యాంగ దినోత్సవం సందర్భంగా మాక్ అసెంబ్లీ నిర్వహించారు. నియోజకవర్గాల వారీగా నిర్వహించిన మాక్ అసెంబ్లీ పోటీల్లో ప్రతి నియోజకవర్గం నుంచి ముగ్గురు చొప్పున విజేతలను ఎంపిక చేశారు. అందులో మొదటి బహుమతి పొందిన విద్యార్థులు జిల్లా స్థాయి మాక్ అసెంబ్లీలో పాల్గొన్నారు. మిగిలిన ఇద్దరు విజేతలకు జిల్లా స్థాయిలో మెడల్స్, ప్రశంసాపత్రాలు అందజేశారు. విజేతలుగా గూడూరు నియోజకవర్గం నుంచి పి.స్పందన (మల్లాం), వై.నైనిక (వరగళి).. బద్దు (సూళ్లూరుపేట), కె.రాజశేఖర్ (ఎల్‌ఏ సాగరం), ఎం.తనుజ భార్గవి (వెంకటగిరి), ఎం.మునిచరణ్ (పనపాకం), అమాన తేజస్విని (చంద్రగిరి), పట్టం ధనుష్ (తిరుపతి), గౌతమ్ నవీన్ (తంబువాని గుంట), సంగీతం జ్ఞానిక, గుమ్మడి పూజశ్రీ (శ్రీకాళహస్తి), ఎం. కౌశిత (ఇరుగులం), జె. ఇషాంత్ (కల్లివెట్టు) ఎంపికయ్యారు. విద్యార్థి దశ నుంచే ప్రతి ఒక్కరూ భారతరాజ్యాంగం పట్ల అవగాహన పెంచుకోవాలని ఇన్‌చార్జి జేసీ, కమిషనర్ ఎన్.మౌర్య సూచించారు. ఇలాంటి కార్యక్రమాల ద్వారా విద్యార్థుల్లో స్టేజ్ ఫియర్ తగ్గి, మాట్లాడే నైపుణ్యాలు పెరుగుతాయని డీఈవో కుమార్ తెలిపారు. రాజ్యాంగ విలువలను తెలుసుకోవడం ప్రతి విద్యార్థికి అవసరమని ఏపీసీ గౌరీ శంకర్ సూచించారు. ఈ కార్యక్రమంలో సీఎంవో జి.సురేష్, ఏఎస్‌వో చంద్రశేఖర్ నాయుడు, ఏపీవో సుధాకర్ నాయుడు, ఇతర అధికారులు, ఉపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.


విద్యార్థులను అభినందిస్తున్న ఇన్‌చార్జి జేసీ మౌర్య

చంద్రగిరి

ఘనంగా రాజ్యాంగ దినోత్సవం



సభలో మాట్లాడుతున్న తులసీరామన్

పాకాల, నవంబరు 26 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని పాఠశాలలు, కళాశాలల్లో బుధవారం రాజ్యాంగ దినోత్సవం నిర్వహించారు. డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ చిత్రపటానికి పుష్పాంజలి ఘటించి, నివాళులర్పించారు. బాలికల జూనియర్ కళాశాల ఆవరణలో పాకాల ప్లాటీనం లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో ప్రిన్సిపాల్ రెడ్డిరామరాజు అధ్యక్షతన సభ నిర్వహించి, రాజ్యాంగ విశిష్టత గురించి వివరించారు. పురవీధులలో ర్యాలీ నిర్వహించారు. ఆర్టీసీ బస్టాండు ఎదుట అంబేడ్కర్ విగ్రహానికి పూలమాలలు వేసి మానవహారంతో ప్రతిజ్ఞ చేశారు. ప్రభుత్వ బాలుర జూనియర్ కళాశాలలో ప్రిన్సిపాల్ హరినాథ్ ఆచారి ఆధ్వర్యంలో నిర్వహించారు. మొగరాల జడ్పీ హైస్కూల్‌లో నిర్వహించిన వేడుకల్లో ఎంఈవో బాబ్జీ రాజ్యాంగ నిర్మాతల కృషిని వివరించారు. ఈ కార్యక్రమంలో అంబేడ్కర్ భవన అధ్యక్షుడు జి.ఆంజినేయులు, లయన్స్ క్లబ్ రామయ్య, అధ్యాపకులు భరణీకుమార్ పుణ్యవతి, వసుంధరాదేవి, విజయలక్ష్మి, జడ్పీహైస్కూల్ హెచ్ఎం సుమలత, ఉపాధ్యాయులు వెంకటసిద్దులు, విమలా విక్టోరియా, రామ్మూర్తి పాల్గొన్నారు.

ప్రజల భాగస్వామ్యంతోనే పర్యావరణ పరిరక్షణ



గ్రామ సమాఖ్య సభ్యులకు శిక్షణ ఇస్తున్న రిసోర్స్ పర్సన్ వెంకటేశులు

భాకరాపేట, నవంబరు 26(ఆంధ్రజ్యోతి): ప్రజల భాగస్వామ్యంతోనే పర్యావరణాన్ని పరిరక్షించుకోగలమని ఎంపీడీవో గిడ్డయ్య అన్నారు. చిన్నగొట్టిగల్లు మండల పరిషత్ సమావేశ మందిరంలో పచ్చదనం -పరిశుభ్రతపై గ్రామ సమాఖ్య సభ్యులకు బుధవారం శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. రిసోర్స్ పర్సన్ వెంకటేశులు మాట్లాడుతూ ప్రజలకు సురక్షితమైన తాగునీరు, పారిశుధ్యంపై అవగాహన కల్పించాలన్నారు. కాలుష్యం లేని పర్యావరణం కోసం పచ్చని చెట్లను పెంచుకోవాలని ప్రజలకు తెలియజేయాలన్నారు. ఇళ్ల నుంచి తడి, పొడి చెత్తను ఎలా సేకరించాలనే అంశంపై అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ ఎంపీడీవో సోమశేఖర రెడ్డి, సూపరింటెండెంట్ సతీశ్ కుమార్, స్వచ్ఛ భారత్ కో-ఆర్డినేటర్ గిరిబాబు, సీసీలు శివశంకర్ రెడ్డి, జీఎస్ డబ్ల్యూ సిబ్బంది వెంకటేశ్వర రెడ్డి, భాను, హరిప్రసాద్ పాల్గొన్నారు.

పారదర్శకంగా ఎఫ్ఎల్ఎన్ కార్యక్రమం



సమావేశంలో మాట్లాడుతున్న డీవైఈవో ఇందిరా దేవి

భాక రాపేట, నవంబరు 25 (ఆంధ్ర జ్యోతి): విద్యా ర్థుల అభ్య సనా సామర్థ్యాలను మదింపు చేసేం దుకు చేపట్టిన ఎఫ్ఎల్ఎన్(ఫౌండేషన్ లిటరసీ అండ్ న్యూమరసీ-ప్రాథమిక అక్షరాస్యత పునాది మదింపు) కార్యక్రమాన్ని పారదర్శకంగా నిర్వహించాలని తిరుపతి డీవైఈవో ఇందిరా దేవి ఉపాధ్యాయులను ఆదేశించారు. ఎఫ్ఎల్ఎన్, అపార్, సోషియల్ ఆడిట్, ఎస్ఏ-1 మార్కుల నమోదు, 10వ తరగతి నామినల్ రోల్స్, తదితర అంశాలపై బుధవారం ఆమె మండలంలోని ఉపాధ్యా యులకు శిక్షణ నిర్వహించారు. ప్రభుత్వ లక్ష్యాలకు అనుగుణంగా విద్యార్థులను తీర్చిదిద్దాలన్నారు. ఈ కార్యక్రమంలో ఎంఈవోలు సత్యనారాయణ, గోపీనాథ్, తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా రాజ్యాంగ దినోత్సవం



అంబేడ్కర్‌కు నివాళులర్పిస్తున్న న్యాయ విద్యార్థులు

భాకరాపేట, నవంబరు 26(ఆంధ్రజ్యోతి): ఆలిండియా లాయర్స్ యూనియన్ ఆధ్వర్యంలో ఎస్వీ యూనివర్సిటీ లా కళాశాల విద్యార్థులు బుధవారం భాకరాపేటలోని జడ్పీ ప్రాథమిక పాఠశాలలో 76వ రాజ్యాంగ దినోత్సవం నిర్వహించారు. ఎస్ఐ రాఘవేంద్ర ముఖ్యఅతిథిగా పాల్గొన్న ఈ కార్యక్రమంలో లా విద్యార్థులు పాఠశాల విద్యార్థులకు రాజ్యాంగం, ప్రాథమిక హక్కులు, చట్టాలపై అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ఉపాధ్యాయులు, న్యాయ విద్యార్థులు నవీన్ కుమార్, సంజీవ్, చైతన్య, మహారిషి, దివ్య, మాధురీ గ్రేస్ పాల్గొన్నారు.

అధికారుల సూచనలతో పంటల సాగు



చిన్నరామాపురంలో పంటలను పరిశీలిస్తున్న దశరథరామిరెడ్డి

చంద్రగిరి, నవంబరు 26(ఆంధ్రజ్యోతి): వ్యవసాయ అధికారుల సూచనలతో రైతులు పంటలను సాగు చేయాలని జిల్లా ఉద్యానవన అధికారి దశరథరామిరెడ్డి అన్నారు. బుధవారం చంద్రగిరి మండలంలోని చిన్నరామాపురంలో రైతన్న మీకోసం కార్యక్రమాన్ని నిర్వహించారు. ముఖ్య అతిథిగా వచ్చిన దశరథరామిరెడ్డి ప్రభుత్వం రైతుల కోసం చేస్తున్న అభివృద్ధి కార్యక్రమాల గురించి, ఉద్యాన శాఖలో అమలవు తున్న వివిధ పథకాల గురించి రైతులకు వివరించారు. వెంకటపతి నాయుడు మామిడి తోటలో వేసిన నవ ధాన్యాల పంటను పరిశీలించారు. రైతులు నవధాన్యాలు చల్లిన తరువాత 50 రోజుల్లోపు పూత రాక ముందే భూమిలో కలియ దున్నాలని సూచించారు. ఈ కార్యక్రమంలో మండల ఉద్యాన అధికారిణి ఎస్.శైలజ, చిన్న రామాపురం గ్రామ ఉద్యాన సహాయకురాలు రాణి, ప్రకృతి వ్యవసాయ సిబ్బంది పాల్గొన్నారు.

మహిళలకు టైలరింగ్‌లో శిక్షణ

చంద్రగిరి, నవంబరు 26(ఆంధ్రజ్యోతి): చంద్రగిరి పట్టణంలోని ద్వారకానగర్ యూనియన్ బ్యాంక్ గ్రామీణ స్వయం ఉపాధి శిక్షణ సంస్థలో డిసెంబరు 1వ తేదీ నుంచి 31 రోజుల పాటు మహిళలకు ఉచితంగా టైలరింగ్ శిక్షణ ఇవ్వనున్నట్లు ఆ సంస్థ డైరెక్టర్ సురేష్‌బాబు ఒక ప్రకటనలో తెలిపారు. తెల్లరేషన్ కార్డు కలిగిన తిరుపతి, చిత్తూరు జిల్లాల్లోని గ్రామీణ ప్రాంతానికి చెందిన 19 నుంచి 50 సంవత్సరాల మధ్య వయస్సు కలిగిన నిరుద్యోగ మహిళలు అర్హులని తెలిపారు. పదో తరగతి చదివి ఉండాలని పేర్కొన్నారు. అభ్యర్థులు ఆధార్, రేషన్ కార్డు జిరాక్స్ కాపీలు, 4 పాస్‌పోర్టు సైజు ఫొటోల తో సంస్థకు వచ్చి దరఖాస్తు చేసుకోవాలని తెలిపారు. మరిన్ని వివరాలకు 7989680587, 9494951289, 6301717672లను సంప్రదించాలని కోరారు.

నేడు తెలుగుగంగ సరఫరాలో అంతరాయం

తిరుపతి, నవంబరు26(ఆంధ్రజ్యోతి) : తెలుగుగంగ హెడ్ వాటర్ వర్క్స్ నిర్వహణ కారణంగా నగరంలో గురువారం తెలుగు గంగ నీటి సరఫరాలో అంతరాయం ఉంటుం దని నగరపాలక సంస్థ కమిషనర్ మౌర్య ఒక ప్రకటనలో తెలిపారు. ఎండీ పుత్తూరు పంప్ హౌస్, మంగళం పంప్ హౌస్‌లో ప్రధాన వాల్వులు దెబ్బతినడంతో నీటి సరఫరా అంత రాయానికి సహకరించాలని కోరారు.

మామిడి రైతులకు బకాయిలు చెల్లించాలి

తిరుపతి(ఆటోనగర్), నవంబరు 26 (ఆంధ్రజ్యోతి): ఉమ్మడి చిత్తూరు జిల్లాలోని మామిడి రైతులకు గుజ్జు కర్మాగారాలు ఇవ్వాల్సిన బకాయిలు త్వరగా చెల్లించాలని, అలాగే ప్రభుత్వం ప్రకటించిన సబ్సిడీ నిధులనూ అందించాలని రైతు సంఘం రాష్ట్ర ఉపాధ్య క్షుడు ఎ.రామానాయుడు డిమాండ్ చేశారు. మామిడి రైతులకు ఎమ్మెల్యేలు, కలెక్టర్, మంత్రి అచ్చెన్నాయుడు ఇచ్చిన హామీలు ఏమయ్యాయని ప్రశ్నించారు. ఇప్పటి వరకు రైతులకు బిల్లులు చెల్లించని ఫ్యాక్టరీల లైసెన్సులు ఎందుకు రద్దు చేయలేదని ప్రశ్నించారు. దీనిపై చర్యలు తీసుకోకపోతే ఆందోళనలు చేయాల్సి వస్తుందని హెచ్చరించారు.

నారాయణగౌడ్‌కు పూలే అంబేడ్కర్ అవార్డు



అవార్డు అందుకుంటున్న నారాయణగౌడ్

తిరు పతి (విశ్వవిద్యాల యాలు), నవంబరు 26 (ఆంధ్రజ్యోతి): రాజ్యాంగ దినోత్సవం సందర్భంగా ఢిల్లీ లోని ఏపీ భవన్‌లో అంబే డ్కర్ పూలే ఫౌండేషన్ వారి పూలే అంబేడ్కర్ అవార్డును బీసీ విద్యార్థి సంఘం అధ్యక్షుడు డాక్టర్ నారాయణగౌడ్ అందుకున్నారు. ఫౌండేషన్ చైర్మన్, మాజీ మంత్రి పర సారత్నం ఈ అవార్డును అందజేసి సత్కరించారు. సామాజిక చైతన్యానికి నారాయణగౌడ్ చేసిన కృషికి గుర్తింపుగా ఈ అవార్డు అందించారు. భవిష్యత్తులో మరింతగా సామాజిక కార్యక్రమాల్లో పాల్గొంటానని ఆయన పేర్కొన్నారు.

అంబేడ్కర్ చిరస్మరణీయుడు : పెద్దిరెడ్డి



అంబేడ్కర్ చిత్రపటానికి నివాళులర్పిస్తున్న మాజీ మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి, ఎంపీ గురుమూర్తి

తిరుపతి(జీవకోన), నవంబరు 26 (ఆంధ్రజ్యోతి): అంబేడ్కర్ చిరస్మరణీయుడు అని మాజీ మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి అన్నారు. ఆయన నివాసం వద్ద బుధవారం భారత రాజ్యాంగ దినోత్సవం నిర్వహించారు. అంబేడ్కర్ చిత్రపటానికి నివాళులర్పించారు. ఎంపీ గురుమూర్తి, మల్లారపు మధు, మునీంద్రనాయక్, నాగేంద్ర, మస్తానమ్మ తదితరులు పాల్గొన్నారు. ఆర్టీసీ బస్టాండు వద్ద గల అంబేడ్కర్ విగ్రహం వద్ద జరిగిన వేడుకల్లో ఎమ్మెల్సీ డాక్టర్ సిపాయి సుబ్రహ్మణ్యం, మేయర్ డాక్టర్ శిరీష, వైసీపీ ఎస్సీ విభాగం జిల్లా అధ్యక్షుడు తలారి రాజేంద్ర, రాష్ట్ర నాయకులు నల్లాని బాబు, ఆరని సంధ్య, గీతాయాదవ్, మునిరాజా, శాంతారెడ్డి, జ్యోతి, నాగేంద్ర పాల్గొన్నారు.

ముగిసిన ఏటీఎల్ ఇన్‌చార్జుల శిక్షణ



శిక్షణ కార్యక్రమంలో ఏటీఎల్ ఇన్‌చార్జులు

తిరుపతి(విద్య), నవంబరు 26 (ఆంధ్రజ్యోతి): నీతి ఆయోగ్, ఇన్నోవేషన్ మిషన్, సమగ్ర శిక్ష, యూనిసెఫ్ సంయుక్త ఆధ్వర్యంలో మూడు రోజులపాటు తిరుపతిలో నిర్వహించిన ఏటీఎల్ ఇన్‌చార్జులు, హెచ్ఎం మూడు రోజుల శిక్షణ కార్యక్రమం బుధవారంతో ముగిసింది. జిల్లాలోని 17 పాఠశాలలకు చెందిన ఏటీఎల్ ఇన్‌చార్జులు 8 ఎగ్జిబిట్లను రూపొందించారు. యూనిసెఫ్ అటల్ కోఆర్డినేటర్ సుదర్శన్, సమగ్ర శిక్ష అదనపు ప్రాజెక్ట్ కోఆర్డినేటర్ గౌరీశంకర్‌రావు, తిరుపతి ఉప విద్యాశాఖాధికారి ఇందిరాదేవి, ఏఎంవో చంద్రశేఖర్‌నాయుడు శిక్షణ కార్య క్రమాలను పర్యవేక్షించారు. ఎస్‌సీఈఆర్టీ స్టేట్ నోడల్ ఆఫీసర్ నాగమణి ఆకస్మిక తనిఖీ చేసి సంతృప్తి వ్యక్తం చేశారు. జిల్లా సైన్స్ అధికారి భానుప్రసాద్, ప్రధానోపాధ్యాయుడు గోపాల్ రెడ్డి, జీవశాస్త్ర ఉపాధ్యాయుడు బాబు సమన్వయకర్తలుగా పనిచేశారు.

‘గేటు’ కష్టాలు ఇంకెన్నాళ్లు?

కోర్టుకెక్కిన ఎర్రచందనం తోట యజమాని - నరసింగాపురం రైల్వే ఫ్లైవోవర్ వద్ద ఆగిన పనులు



ఫ్లైవోవర్ ముందు ఉన్న ఎర్రచందనం తోపు



రైల్వే గేటు వేయడంతో నిలిచిపోయిన వాహనాలు

చంద్రగిరి, నవంబరు 26(ఆంధ్రజ్యోతి): మండల పరిధిలోని నరసింగాపురం రైల్వే గేటు వద్ద వాహనదారులకు అవస్థలు తప్పడం లేదు. ఈ మార్గంలో రోజూ 30కి పైగా రైళ్లు రాకపోకలు సాగిస్తుంటాయి. ఈ క్రమంలో ఎప్పుడు చూసినా గేటు మూసి ఉంచడంతో గంటల తరబడి వేచి ఉండాల్సి వస్తోంది. 2017-18లో కేంద్ర ప్రభుత్వం సేతువారధి పథకంలో నరసింగాపురం వద్ద రైల్వే ఫ్లైవోవర్ నిర్మాణానికి రూ.87 కోట్లు మంజూరు చేసింది. అందులో 16 కోట్లు ల్యాండ్ అక్విజేషన్ కోసం కేటాయించారు. బెంగళూరుకు చెందిన క్రిష్ ఇన్‌ఫ్రా కంపెనీ టెండర్ దక్కించుకుని, పనులు ప్రారంభించారు. 2021 నవంబరు నాటికి ఫ్లైవోవర్‌తో పాటు 70 శాతం పనులు పూర్తయ్యాయి. రైల్వే గేటు సమీపంలో ఎర్రచందనం తోట ఉండటంతో అప్పట్లో అటవీశాఖ అనుమతులు రాకపోవడంతో మరో 30 శాతం నిర్మాణ పనులు నిలిపివేశారు. బాధితులకు నష్టపరిహారం కూడా ప్రభుత్వం చెల్లించింది. ఫ్లైవోవర్ ముందున్న ఎర్రచందనం చెట్లను తొలగించడానికి నేషనల్ హైవే అధికారులు అటవీ శాఖ అనుమతుల కోసం పంపారు. అయితే ఎర్రచందనం తోట యజమాని తనకు నష్టపరిహారం తక్కువ ఇచ్చారని కోర్టును ఆశ్రయించినట్లు సమాచారం. అంతేకాకుండా అటవీశాఖ అనుమతులు రాలేదని సమాచారం. తద్వారా నిర్మాణ పనులు నిలిచిపోయాయి. ఇప్పటికే మదనపల్లె, తిరుపతి జాతీయ రహదారిలో ప్రయాణికులు రైల్వే గేటు వలన తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ఇకనైనా పనులు పూర్తి చేసే విధంగా చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు.

వైభవంగా సుబ్రహ్మణ్య షష్ఠి వేడుకలు



పట్టువస్త్రాలు సమర్పిస్తున్న సుధారెడ్డి



కల్యాణోత్సవం జరిపిస్తున్న పురోహితులు

పాకాల, నవంబరు 26 (ఆంధ్ర జ్యోతి) : మండలంలోని ఊట్లవారి పల్లె ఆనందగిరి (పాళ్యంకొండ)పై వెలసిన శ్రీవల్లీ దేవసేన సమేత సుబ్రమణ్యస్వామి ఆలయంలో స్వామివారి జన్మ తిథిని పురస్కరిం చుకుని బుధ వారం షష్ఠి వేడుకలు నిర్వహిం చారు. ఆలయంలో స్వామివారికి అభి షేకం నిర్వహించి, ప్రత్యేక పుష్పాలతో అలంకరించి పూజలు చేశారు. ఆల య ఆవరణలోని కల్యాణ మండ పంలో కళ్యాణోత్సవం నిర్వహిం చారు. ఎమ్మెల్యే నాని సతీమణి సుధా రెడ్డి స్వామివారికి పట్టువస్త్రాలు సమర్పించి కల్యాణోత్సవంలో పాల్గొన్నారు. మధ్యాహ్నం భక్తులకు అన్నప్రసాద వితరణ చేశారు. ఈ కార్యక్రమంలో ఆలయ చైర్మన్ సోంపల్లి చంద్రశేఖర్ నాయుడు, ఈవో యువరాణి, టీడీపీ మండల కన్వీనర్ బోయపాటి నాగరాజనాయుడు, ఆలయ కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

రాజ్యాంగంపై అవగాహన అవసరం



మాక్ అసెంబ్లీని వీక్షిస్తున్న విద్యార్థులు

చంద్రగిరి, నవంబరు 26(ఆంధ్రజ్యోతి): రాజ్యాంగం పట్ల ప్రతి ఒక్కరికీ అవగాహన ఉండాలని ఎంఈవోలు లలితకుమారి, భాస్కర్‌బాబు అన్నారు. బుధవారం చంద్రగిరి మండలంలో అన్ని ప్రభుత్వ పాఠశాలల్లో 75వ రాజ్యాంగ దినోత్సవం నిర్వహించారు. విద్యార్థులతో రాజ్యాంగ ప్రవేశిక ప్రతిజ్ఞ రూపంలో చేయించారు. చంద్రగిరిలోని బాలికల ఉన్నత పాఠశాలలో ఎంఈవోలు మాట్లాడుతూ విద్యార్థి దశ నుంచే రాజకీయాల పట్ల ఆసక్తిని పెంపొందించేందుకే ఈ కార్యక్రమం నిర్వహిం చినట్లు చెప్పారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయులు వెంకటరమణారెడ్డి, ఉపాధ్యాయుని, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

అర్హులైన రైతులందరికీ అన్నదాత సుఖీభవ



పుల్లావాండ్లపల్లెలో అన్నదాత సుఖీభవ ప్రచారంలో ఎమ్మెల్యే నాని

పాకాల, నవంబరు 26 (ఆంధ్రజ్యోతి) : అర్హులైన రైతులందరికీ అన్నదాత సుఖీభవ పథకం అందజేస్తామని ఎమ్మెల్యే పులివర్తి నాని అన్నారు. మండలంలోని పదిపుట్లబైలు పంచాయతీ పుల్లావాండ్లపల్లెలో బుధవారం నిర్వహించిన అన్నదాత సుఖీభవ ఇంటింటి ప్రచార కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. రైతుల ఇండ్లవద్దకెళ్లి పథకం గురించి వివరించారు. పథకం రాని రైతులు పట్టాదారు పాసుపుస్తకం, ఆధార్ కార్డ్, బ్యాంక్ ఖాతాను అనుసంధానం చేసుకోవాలన్నారు. సేంద్రియ సాగుతో నాణ్యమైన అధిక దిగుబడులు సాధించాలని కోరారు. అటవీ సమీప గ్రామాలలో ఏనుగులతో నష్టపోయిన పంటలకు పరిహారం చెల్లిస్తామన్నారు. ఈ కార్యక్రమంలో తహసీల్దార్ సంతోష్‌సాయి, వ్యవసాయ అధికారిణి హరితకుమారి, టీడీపీ మండల కన్వీనర్ బోయపాటి నాగరాజనాయుడు, ఎన్డీయే కూటమి నేతలు పాల్గొన్నారు.

పశువుల్లో మీథేన్ తగ్గింపునకు సరికొత్త ఆలోచన



విద్యార్థిని అభినందిస్తున్న సురేష్‌కుమార్, జగపతిరామయ్య

తిరుపతిరూరల్, నవంబరు 26 (ఆంధ్రజ్యోతి): పశువుల(ఆవు, గేదె) నుంచి వెలువడే మీథేన్ వాయువును సహజ ఆహార పదార్థాలతో కృత్రిమ మేధ(ఏఐ) సాంకేతికత జోడించి తగ్గించే విధానంపై తిరుపతిలోని ఎస్వీ వెటర్నరీ కళాశాల విద్యార్థి నస్వర్‌ఖాన్ సరికొత్త ఆలోచన చేశారు. తనకు తట్టిన ఈ వినూత్న ఆలోచనని అధ్యాపకుడు డాక్టర్ కె.సుధీర్‌తో పంచుకున్నారు. అధ్యాపకుడి సహకారంతో పరిశోధనాపత్రంగా రూపొందించి బెంగళూరులో నిర్వహించిన నేషనల్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ యానిమల్ న్యూట్రిషన్ అండ్ ఫిజియాలజీ అంతర్జాతీయ సదస్సులో ఆవిష్కరించారు. దీనికి బహుమతి, సర్టిఫికెట్ అందజేశారని కళాశాల ఏడీ డాక్టర్ పి.జగపతిరామయ్య పేర్కొన్నారు. విద్యార్థిని వెటర్నరీ సైన్స్ డీన్ ఆర్వీసురేష్‌కుమార్, అధ్యాపకులు అభినందించారు.

అధికారులు బాధ్యతగా పనిచేయాలి

రామచంద్రాపురం, నవంబరు 26(ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ సంక్షేమ పథకాలను ప్రజలకు అందజేయడంలో అధికారులు బాధ్యతగా పనిచేయాలని ఎంపీపీ బ్రహ్మానందరెడ్డి కోరారు. బుధవారం ఎంపీడీవో కార్యాలయంలో ఎంపీపీ అధ్యక్షతన మండల సర్వసభ్య సమావేశం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ గ్రామాల్లో తాగునీటి పైపులైన్ల లీకేజీలను అరికట్టాలని కోరారు. జడ్పీటీసీ ఢిల్లీరాణి మాట్లాడుతూ వర్షాకాలంలో దెబ్బతిన్న రోడ్లను మరమ్మతు చేయాలని కోరారు. తహసీల్దారు మధుసూదన్‌రావు మాట్లాడుతూ గ్రామాల్లో రీసర్వే జరుగుతున్నందున రైతులు సరిచూసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీవో పులిరామ్‌సింగ్, ఎంఈవో జయవేలు, మార్కొండేయనాయుడు, ఎంపీటీసీలు చంద్రశేఖర్‌రెడ్డి, మంజుల, కృష్ణవేణి, లావణ్య, కవిత, రాజేష్,సర్పంచులు మురగయ్య, భారతి పాల్గొన్నారు.

తిప్పారెడ్డికి అంబేడ్కర్‌పూలే జాతీయ అవార్డు



కేంద్రమంత్రి నుంచి అవార్డు అందుకుంటున్న తిప్పారెడ్డి

తిరుపతిరూరల్, నవంబరు26(ఆంధ్రజ్యోతి): తిరుపతికి చెందిన అంబేడ్కర్ గ్లోబల్ లా ఇన్‌స్టిట్యూట్ చైర్మన్ డాక్టర్ ఆర్.తిప్పారెడ్డికి జాతీయస్థాయి అంబేడ్కర్, పూలే అవార్డు లభించింది. ఢిల్లీలోని ఆంధ్రభవన్‌లో భారత రాజ్యాంగ దినోత్సవాన్ని పురస్కరించుకుని అంబేడ్కర్, పూలే ఫౌండేషన్ ఆధ్వర్యంలో బుధవారం నిర్వహించిన కార్యక్రమంలో బీహార్ మాజీ సీఎం, కేంద్రమంత్రి జితిన్‌రామ్ మాంజి చేతుల మీదుగా అవార్డుతో సన్మానించారు. విద్యాభివృద్ధి, సామాజిక సేవలకు గుర్తింపుగా ఈయనకు ఈఅవార్డు అందించినట్లు పేర్కొన్నారు. తిప్పారెడ్డి మాట్లాడుతూ ప్రతిష్టాత్మక అవార్డు అందుకోవడం చాలా సంతోషంగా ఉందన్నారు.

సన్నీ ఒప్పోటెక్ ఉద్యోగాలకు శ్రీరామ విద్యార్థులు



తిరుపతిరూరల్, నవంబరు 26 (ఆంధ్రజ్యోతి): కరకంబాడీ రోడ్డులోని శ్రీరామ ఇంజినీరింగ్ కళాశాలలో సన్నీ ఒప్పోటెక్ సంస్థ ఆధ్వర్యంలో బుధవారం నిర్వహించిన క్యాంపస్ ఇంటర్వ్యూలలో 11 మంది విద్యార్థులు ఎంపికైనట్లు ప్రిన్సిపాల్ డాక్టర్ కె.జయచంద్ర పేర్కొన్నారు. సంస్థ హెచ్ఆర్ కావ్య నేతృత్వంలో విద్యార్థులకు రాతపరీక్ష, టెక్నికల్, వ్యక్తిత్వ ఇంటర్వ్యూలు నిర్వహించారని, ప్రతిభచాటిన 11మందిని ఉద్యోగాలకు ఎంపిక చేశారని అన్నారు. విద్యార్థులను కళాశాల చైర్మన్ మన్నెం రామిరెడ్డి, సెక్రటరీ మన్నెం రామసుబ్బారెడ్డి, డైరెక్టర్ మన్నెం అరవింద్‌కుమార్‌రెడ్డి, ప్లేస్‌మెంట్ ఆఫీసర్ విష్ణువర్ధన్ రెడ్డి, అధ్యాపకులు అభినందించారు.

పోలింగ్ బూత్‌ల మార్పులపై పునరాలోచించండి

తిరుపతి, నవంబరు26(ఆంధ్రజ్యోతి) : పోలింగ్ బూత్‌ల మార్పు చేర్పులపై పునరాలోచించాలని వైసీపీ విద్యార్థి విభాగం రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ చెవిరెడ్డి హర్షిత్ రెడ్డి కోరారు. ఈ మేరకు తిరుపతి ఆర్డీవో రామ్మోహన్‌కు వినతి పత్రం అందజేశారు. మెజారిటీ రాజకీయ పార్టీల ప్రతినిధుల ఆమోదం మేరకు నిర్ణయం తీసుకుంటామని ఆర్డీవో చెప్పారు. తిరుపతి ఆర్డీవో కార్యాలయంలోని సమావేశ మందిరంలో బుధవారం నెలవారీ ఎన్నికల సమావేశం నిర్వహించారు. వైసీపీ, కాంగ్రెస్ పార్టీ ప్రతినిధులు హాజరయ్యారు. కాగా, పదిమందికిపైగా వైసీపీ కార్యకర్తలు హాజరుకావడంపై ఆర్డీవో అభ్యంతరం వ్యక్తం చేశారు. పార్టీ నుంచి ఒకరిద్దరు మాత్రమే హాజరుకావాలని చెప్పడంతో కొందరు వెనుదిరిగారు.

ఎంపీడీవోగా పులిరామ్ సింగ్



రామచంద్రాపురం, నవంబరు 26 (ఆంధ్రజ్యోతి): రామచంద్రాపురం ఎంపీడీవోగా బి.పులిరామ్ సింగ్ బుధవారం బాధ్యతలు స్వీకరించారు. ఆయన కడప జిల్లా కమలాపురం నియోజకవర్గం వీరప్పనాయనపల్లి మండల డిప్యూటీ ఎంపీడీవోగా పనిచేస్తూ పదోన్నతిపై ఇక్కడికి వచ్చారు. నూతన ఎంపీడీవోను కార్యాలయ సిబ్బంది శాలువాతో సత్కరించి, పుష్ప గుచ్ఛాలు అందజేశారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ ఎంపీడీవో శ్రీనివాసులు, పరిపాలనాధికారి చంద్రశేఖరరెడ్డి, ఈశ్వర్, కీర్తి, రేవంత్, పంచాయతీ కార్యదర్శులు పాల్గొన్నారు.

యూనివర్సిటీల్లో రాజ్యాంగ దినోత్సవం



పద్మావతి వర్సిటీలో ర్యాలీ నిర్వహిస్తున్న అధ్యాపకులు, విద్యార్థినులు

తిరుపతి (విశ్వవిద్యాలయాలు), నవంబరు 26 (ఆంధ్రజ్యోతి): ఎస్వీయూ, పద్మావతి, సంస్కృత యూనివర్సిటీల్లో రాజ్యాంగ దినోత్సవం నిర్వహించారు. ఎస్వీయూ లా కాలేజీలో ప్రిన్సిపాల్ సుధారాణి, వైస్ ప్రిన్సిపాల్ భాస్కరరెడ్డి, డీన్ మురళీధర్, ప్రోగ్రాం కన్వీనర్ అంజన్‌సింగ్ పాల్గొని మాట్లాడారు. ● పద్మావతి వర్సిటీ లా విభాగం ఆధ్వర్యంలో వీసీ ఉమ, రిజిస్ట్రార్ రజని, తిరుపతి మూడవ అదనపు జిల్లా జడ్జి గురునాథ్, లా హెడ్ సీతాకుమారి పాల్గొని మాట్లాడారు. పదవ అదనపు జిల్లా జడ్జి రామచంద్రుడు మాట్లాడుతూ రాజ్యాంగ విలువలను కాపాడుకోవాలన్నారు. ● సంస్కృత యూనివర్సిటీలో రిజిస్ట్రార్ వెంకట నారాయణరావు, డీన్ రజనీకాంత్ శుక్లా ఆధ్వర్యంలో విద్యార్థులు, ఉద్యోగులు ప్రతిజ్ఞ చేశారు.

● **డెయిరీ టెక్నాలజీలో:** ఎస్వీ వెటర్నరీ వర్సిటీ పరిధిలోని డెయిరీ టెక్నాలజీ కళాశాలలో అంబేడ్కర్ చిత్రపటానికి పలువురు నివాళి అర్పించారు. రాజ్యాంగ రచనకు అంబేడ్కర్ చేసిన కృషిని గుర్తు చేసుకున్నారు. అసోసియేట్ డీన్ డాక్టర్ జి.గంగరాజు, అధ్యాపకులు పాల్గొన్నారు.

అంబేడ్కర్ గ్లోబల్ లా ఇన్‌స్టిట్యూట్‌లో..

తిరుపతిరూరల్, నవంబరు26 (ఆంధ్రజ్యోతి): తిరుపతి-రేణిగుంట రోడ్డులోని అంబేడ్కర్ గ్లోబల్ లా ఇన్‌స్టిట్యూట్‌లో రాజ్యాంగ దినోత్సవాన్ని పురస్కరించుకుని విద్యార్థులతో అధ్యాపకులు, అతిథులు కలసి రాజ్యాంగ పీఠికపై ప్రతిజ్ఞ చేశారు. ముఖ్య అతిథిగా హాజరైన శ్రీకృష్ణదేవరాయ వర్సిటీ రిటైర్డ్ ప్రొఫెసర్ ఎస్వీ పుల్లారెడ్డి మాట్లాడుతూ రాజ్యాంగాన్ని, విలువలను కాపాడుకోవాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపైనా ఉందన్నారు. వ్యాసరచన, వక్తృత్వ పోటీలలో ప్రతిభచాటిన విద్యార్థులకు బహుమతులు, సర్టిఫికెట్లు అందజేశారు.

ఓటేరులో..

తిరుపతి రూరల్ మండలం ఓటేరులో రాజ్యాంగ దినోత్సవాన్ని పురస్కరించుకుని గ్రామానికి చెందిన స్వాతంత్ర్య సమరయోధులు రామకృష్ణారావు జ్ఞాపకార్థం స్థాపించిన అంబేడ్కర్ విగ్రహానికి ఎస్సీ, ఎస్టీ హక్కుల సంక్షేమ వేదిక జిల్లా అధ్యక్షుడు సూర్యకిరణ్ నేతృత్వంలో పలువురు పుష్పాంజలితో నివాళి అర్పించారు. గ్రామ కమిటీ చైర్మన్ ఇస్మాయిల్, టీడీపీ పంచాయతీ అధ్యక్షుడు మోహన్, యూనిట్ ఇన్‌చార్జి సుదర్శన్, రంగయ్య, విశ్వనాథ్, సిద్ధారెడ్డి, వెంకటరత్నం పాల్గొన్నారు.

జాతీయ స్థాయి కరాటే పోటీలకు ఎంపిక



పతకాలు సాధించిన కరాటే క్రీడాకారులు

తిరుపతి(క్రీడలు), నవంబరు 26 (ఆంధ్రజ్యోతి) : 69వ స్కూల్‌గేమ్స్ ఆఫ్ ఇండియా కరాటే పోటీలలో తిరుపతి క్రీడాకారులు ప్రతిభ చాటారు. రాజమండ్రిలో మంగళవారం రాత్రి జరిగిన ఈ పోటీల్లో నవీన్ మార్షల్ ఆర్ట్స్‌లో శిక్షణ పొందిన క్రీడాకారులు పాల్గొన్నారు. సూర్య, వెన్య, అదితి బంగారు పతకాలు కైవసం చేసుకున్నారు. దోమిక, ప్రేరిత, ధనశ్రీలు బ్రాంజ్ మెడల్ సాధించారు. బంగారు పతకాలు సాధించిన వారిని జాతీయ స్థాయి పోటీలకు ఎంపిక చేశారు. వీరిని నవీన్ మార్షల్ ఆర్ట్స్ వ్యవస్థాపకుడు పి.నవీన్, పలువురు క్రీడా ప్రముఖులు అభినందించారు.

ఆర్టీసీలో రాజ్యాంగ దినోత్సవం



కార్యక్రమంలో పాల్గొన్న ఆర్టీసీ ఉన్నతాధికారులు, సిబ్బంది

తిరుపతి(ఆర్టీసీ), నవంబరు 26(ఆంధ్రజ్యోతి): స్థానిక ప్రజారవాణాధికారి కార్యాలయంలో బుధవారం ఉదయం రాజ్యాంగ దినోత్సవం నిర్వహించారు. రాజ్యాంగం విశిష్టత గురించి వివరించారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ సీఎంఈ బాలాజీ, పర్సనల్ ఆఫీసర్ చాందిని పాల్గొన్నారు.

కల్యాణకట్టలో శ్రీవారి సేవకులుగా అవకాశమివ్వండి

తిరుపతి అర్బన్, నవంబరు 26(ఆంధ్రజ్యోతి): తిరుమల శ్రీవారి కల్యాణకట్టలో శ్రీవారి సేవకులుగా అవకాశమివ్వాలని నాయీబ్రాహ్మణ రాష్ట్ర అధ్యక్షుడు ఆవులపాటి బుజ్జిబాబు టీటీడీ యాజమాన్యానికి విజ్ఞప్తి చేశారు. బుధవారం ఉదయం టీటీడీ పరిపాలన భవనం ముందు ఈ మేరకు నిరసన వ్యక్తం చేశారు. ఆయన మాట్లాడుతూ భక్తులకు సేవలందించడానికి నాయీబ్రాహ్మణులు సిద్ధంగా ఉన్నారని తెలిపారు. ఈ విషయంలో ప్రభుత్వం, టీటీడీ చొరవ చూపాలని కోరారు. ఈ కార్యక్రమంలో సంఘం నేతలు సుధాకర్, జయకుమార్‌బాబు, క్రాంతి, హేమలత పాల్గొన్నారు.

ఉద్యోగులు సమయపాలన పాటించాలి



తనిఖీలు చేస్తున్న వీసీ నరసింగరావు

తిరుపతి (విశ్వవిద్యాలయాలు), నవంబరు 26 (ఆంధ్రజ్యోతి): యూనివర్సిటీ ఉద్యోగులు సమయపాలన పాటించకపోతే చర్యలు తప్పవని ఎస్వీయూ వీసీ నరసింగరావు స్పష్టం చేశారు. రెక్టార్ అప్పారావుతో కలిసి బుధవారం ఆయన వివిధ విభాగాలను తనిఖీ చేశారు. ఉద్యోగుల హాజరుపట్టికను తనిఖీ చేశారు. ఆయా విభాగాల అధికారులు, ఉద్యోగుల పనితీరును పరిశీలించారు. కొందరు సమయపాలన పాటించడం లేదని, ఇలాంటి వారు పద్ధతి మార్చుకోకపోతే చర్యలు తప్పవని హెచ్చరించారు.

రోడ్డంతా గుంతలే





కులశేఖర్ ఆళ్వార్ రోడ్డు నుంచి రవీంద్రానగర్‌కు వెళ్లే మార్గంలో గుంతలు

తిరుపతి అర్బన్, నవంబరు 26(ఆంధ్రజ్యోతి): నగర పరిధిలోని ఒకటో డివిజన్ కులశేఖర ఆళ్వార్ ప్రధాన రహదారి నుంచి రవీంద్రానగర్‌కు వెళ్లే అనుసంధాన రోడ్డు పూర్తిగా గుంతలు తేలిపోయింది. రెండేళ్లుగా ఈ రోడ్డు పరిస్థితి ఇలాగే ఉంది. వర్షం కురిసిన ప్రతిసారీ గుంతలు నీటితో నిండి మడుగులను తలపిస్తోంది. దీంతో బడి పిల్లలు అవస్థలు పడుతున్నారు. ద్విచక్ర వాహన చోదకులు నరకం చూస్తున్నారు. పాదచారులు వెళ్లే పరిస్థితి లేదు. ఎన్నిసార్లు ఫిర్యాదు చేసిన నగరపాలక సంస్థ పట్టించుకోవడం లేదని స్థానికులు ఆరోపిస్తున్నారు. ఇప్పటికైనా తక్షణమే స్పందించి రోడ్డుకు మరమ్మతులు చేయాలని కోరుతున్నారు.

అరుణమ్మ కాలనీలో దొంగలుపడ్డారు

● బంగారు ఆభరణాలు, వెండి వస్తువుల అపహరణ



చోరీ జరిగిన ఇంటిని పరిశీలిస్తున్న సీఐ

తిరుపతి (నేర విభాగం), నవంబరు 26 (ఆంధ్రజ్యోతి): తిరుపతి రూరల్ మండలం అరుణమ్మ కాలనీలో దొంగలు పడ్డారు. రూరల్ సీఐ చిన్న గోవిందు కథనం మేరకు.. అరుణమ్మ కాలనీకి చెందిన బోనాల మురళి తల్లి దండ్రులతో కలిసి ఈనెల 23వ తేదీన చెన్నైలోని తమ్ముడి వద్దకు వెళ్లారు. బుధవారం తిరిగి వచ్చారు. ఇంటి ముందు ఐరన్ గేటుకు వేసిన తాళం విరిగి గోడపై ఉండటం గమనించారు. ఇంటి తలుపు కూడా పగిలి ఉండటంతో లోనికెళ్లి పరిశీలించారు. బీరువాలో ఉంచిన 24 గ్రాముల బంగారు ఆభరణాలు, 300 గ్రాముల వెండి వస్తువులు కనబడలేదు. మురళి ఫిర్యాదు మేరకు సీఐ కేసు నమోదు చేసి, దర్యాప్తు చేస్తున్నారు.

కబ్జాదారులపై చర్యలు తీసుకోవాలి

తిరుపతి(జీవకోన), నవంబరు 26(ఆంధ్రజ్యోతి): రాజకీయ పలుకుబడి ఉపయోగించి కొందరు తమ భూమిని కబ్జా చేసేందుకు ప్రయత్నిస్తున్నారని, వారిపై చర్యలు తీసుకోవాలని సత్యవేడు మండలం తిరుమలకుప్పంకు చెందిన గిరిధర్ విజ్ఞప్తి చేశారు. ప్రెస్‌క్లబ్‌లో ఆయన మాట్లాడుతూ నారాయణవనం మండలం కల్యాణపురం గ్రామం సర్వే నెంబరు 49/3లో భూమిని కొనుగోలు చేశామన్నారు. అందులో డెయిరీ ఏర్పాటుకు రూ.50లక్షలతో మిషనరీ ఏర్పాటు చేశామన్నారు. బ్యాంకు నుంచి రుణం కూడా తీసుకున్నామని, దాన్ని కొందరు కబ్జా చేసేందుకు ప్రయత్నిస్తున్నారని తెలిపారు. మిషనరీని మాయం చేశారన్నారు. పోలీసులకు ఫిర్యాదు చేసినా ఇప్పటివరకు స్పందన లేదన్నారు. అధికార పార్టీకి చెందిన కొందరు తమపై దాడికి ప్రయత్నిస్తున్నారన్నారు. కలెక్టర్, రెవెన్యూ అధికారులు, పోలీసులు స్పందించి తమకు న్యాయం చేయాలని కోరారు.

దివ్యాంగులకు క్రీడా పోటీలు

తిరుపతి(కలెక్టరేట్), నవంబరు 26 (ఆంధ్రజ్యోతి): అంతర్జాతీయ వికలాంగుల దినోత్స వాన్ని పురస్కరించుకుని జిల్లాలో దివ్యాంగులకు ప్రత్యేక క్రీడా పోటీలు నిర్వహిస్తు న్నట్లు కలెక్టర్ వెంకటేశ్వర్ బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ నెల 28, 29 తేదీలలో ఎస్వీ ఆర్ట్స్ కళాశాల మైదానంలో తిరుపతి, చిత్తూరు జిల్లాలకు సంబంధించి దివ్యాంగులకు ప్రత్యేక ఆటల పోటీలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. డిసెంబరు 6న కలెక్టరేట్ వేదికగా వికలాంగుల దినోత్సవం నిర్వహిస్తున్నట్లు పేర్కొన్నారు.

జీవకోనలో మహాభారత ఉత్సవాలు



తపస్సు మాను వద్ద వరపడ్డ మహిళలు

తిరుపతి(జీవకోన), నవంబరు 26 (ఆంధ్రజ్యోతి): స్థానిక జీవకోనలోని జీవ లింగేశ్వర స్వామి ఆలయం వద్ద మహాభారత ఉత్సవాలు ఘనంగా నిర్వహిస్తున్నారు. బుధవారం అర్జున తపస్సు, శశిరేఖపరిణయం కార్యక్రమాలు నిర్వహించారు. అర్జున తపస్సు భక్తులను ఆకట్టుకుంది. మధ్యాహ్నం భాగవతారిణి విజయకుమారి హరికథాగానం చేశారు. ప్రజలకు అన్నదానం చేశారు. ఈ కార్యక్రమంలో నిర్వాహకులు అన్నా రామకృష్ణ, అన్నా మల్లీశ్వరి, రవిరెడ్డి, ధనంజయరెడ్డి పాల్గొన్నారు.

ఎంపీహెచ్ఈవో అసోసియేషన్ నూతన కార్యవర్గం



సమావేశంలో మాట్లాడుతున్న రామకృష్ణ

తిరుపతి(జీవకోన), నవంబరు 26 (ఆంధ్రజ్యోతి): ఎంపీహెచ్ఈఓ నూతన కార్యవర్గాన్ని ఎన్నుకున్నట్లు రాష్ట్ర ఎన్నికల అధికారి రామకృష్ణ తెలిపారు. బుధవారం ప్రెస్‌క్లబ్‌లో ఆయన మాట్లాడుతూ జిల్లా అధ్యక్షుడిగా రమేష్‌బాబు, సహ అధ్యక్షుడిగా మురళీధర్, ఉపాధ్యక్షులుగా శ్రీను, నాగరాజు, ప్రధాన కార్యదర్శిగా బాలసుబ్రహ్మణ్యం, సంయుక్త కార్యదర్శులుగా రామచంద్రరాజు, విద్యాసాగర్, కోశాధికారిగా సిరాజుద్దీన్, ఆర్గనైజింగ్ సెక్రటరీలుగా మహబూబ్‌బాషా, రామాంజనేయులురెడ్డి ఎన్నికయ్యారన్నారు. సమస్యల పరిష్కారానికి కృషి చేస్తామన్నారు. ఈ కార్యక్రమంలో అసోసియేషన్ నేతలు నరసింహ ప్రసాద్, విద్యాసాగర్, రమేష్‌బాబు, శివ, సుబ్రహ్మణ్యం, సిరాజుద్దీన్ పాల్గొన్నారు.

దివ్యాంగుల క్రీడా పోటీల్లో ప్రతిభ



పతకాలు, సర్టిఫికెట్లతో విజేతలు

తిరుపతి(క్రీడలు), నవంబరు 26(ఆంధ్రజ్యోతి): స్థానిక శ్రీనివాస క్రీడా సముదాయంలో బుధవారం నిర్వహించిన జిల్లాస్థాయి దివ్యాంగుల క్రీడా పోటీల్లో పలువురు ప్రతిభ కనబరిచారు. బ్యాడ్మింటన్, చెస్, అథ్లెటిక్స్ లాంగ్‌జంప్, షాట్‌పుట్, వాలీబాల్ పోటీలలో హోరాహోరీగా తలపడ్డారు. మొదటి స్థానంలో నిలిచిన వారికి బంగారు, ద్వితీయ స్థానం వారికి వెండి పతకాలు, ప్రశంసాపత్రాలు అందజేశారు. దివ్యాంగుల అసోసియేషన్ ప్రెసిడెంట్ టి.మోహన్‌బాబు, డీఎస్‌డీవో శశిధర్, శాప్ కోచ్‌లు లక్ష్మీకరుణ, ఆది, గోపి, హిందూజ, వినోద్, ప్రేమ్‌నాథ్, రియాజ్, నాగరాజు, నాని, విజయ్, అశోక్ పాల్గొన్నారు.

ఆర్టీసీ తీరు.. భక్తుల బేజారు

తిరుమలకు వెళ్లాలంటే బస్సు మూడుసార్లు ఎక్కి దిగాల్సిందే - వృద్ధ, మహిళా భక్తుల అవస్థలు



టిక్కెట్ తీసుకుని మళ్లీ బస్సు ఎక్కుతున్న భక్తబృందం

తిరుపతి(ఆర్టీసీ), నవంబరు 26(ఆంధ్రజ్యోతి): తిరుమల శ్రీవారి భక్తుల పట్ల ఆర్టీసీ నిర్లక్ష్య ధోరణి ప్రదర్శిస్తోందన్న విమర్శలున్నాయి. టిక్కెట్ కోసం రెండుసార్లు ఎక్కించి, దించుతూ అవస్థలపాలు చేస్తోంది. అదనంగా టోల్‌గేట్ చెకింగ్ మరింత బాధిస్తోంది. భక్తుల రద్దీ దృష్ట్యా 1980లో ఆర్టీసీలో డిస్పాచ్ విధానం ప్రవేశపెట్టారు. విష్ణునివాసం(అప్పట్లో కోనేటికట్ట), తిరుమల బాలాజీ బస్టాండులో ఏర్పాటు చేసిన కౌంటర్లలో టిక్కెట్స్ జారీ చేసి, బస్సులు వచ్చేంత వరకు కంపార్టుమెంట్లో ఉంచేవారు. బస్సురాగానే ఎక్కించి డిస్పాచ్ చేసేవారు. కాలక్రమేణ భక్తులు, బస్సుల సంఖ్య పెరగడంతో ఈ విధానంలో మార్పులు చేశారు. విష్ణునివాసం, మార్గంమధ్యలో ఎక్కించుకుని అలిపిరి బాలాజీ బస్టాండులో టిక్కెట్ కోసం దించడం, మళ్లీ బస్సు ఎక్కించడం, ఆ తర్వాత కండక్టర్ వచ్చి టిక్కెట్స్ లెక్కించి పంపే విధానం అమలు చేశారు. ఈ విధానంలో అలిపిరి, మంగళం డిపోల బస్సులు మాత్రమే నడుస్తున్నాయి. బస్సులో టిక్కెట్ జారీ చేయకుండా విష్ణునివాసం, అలిపిరి బాలాజీ బస్టాండు వద్ద ప్రత్యేకంగా దించుతున్నారు. ఇలా టోల్‌గేట్‌తో సహా మూడుసార్లు ఎక్కించడం, మూడుసార్లు దించడం వల్ల భక్తులు తీవ్ర అసహనం చెందుతున్నారు.



సెల్‌ఫోన్లు చూస్తూ కాలక్షేపం చేస్తున్న కండక్టర్లు





అతికష్టంగా బస్సు ఎక్కుతున్న వృద్ధుడు, దిగుతున్న మహిళ

సెల్‌ఫోన్లతో కాలక్షేపం చేస్తున్న కండక్టర్లు

విష్ణునివాసం, అలిపిరి కేంద్రాలలో రోజుకు 75మంది కండక్టర్లు పనిచేస్తున్నారు. వీరికి సక్రమంగా డ్యూటీలు కేటాయించడం లేదన్న విమర్శలు వినిపిస్తున్నాయి. ఒకవైపు భక్తులు అవస్థలు పడుతుంటే మరో వైపు కండక్టర్లు పనిలేక సెల్‌ఫోన్లతో కాలక్షేపం చేయడం తరచూ కనిపిస్తోంది. 2018లో అప్పటి ఉన్నతాధికారి డిస్పాచ్ విధానం రద్దు చేసే ప్రతిపాదనలు తెచ్చినా సిబ్బంది కొరత పేరుతో ఉద్యోగ సంఘాల నాయకులు వ్యతిరేకించడంతో మూలనపడింది.

చర్యలు తీసుకుంటాం

డిస్పాచ్ విధానంతో భక్తులకు ఎదురవుతున్న సమస్యలు నా దృష్టికి వచ్చింది. టీటీడీ నుంచి ఫిర్యాదు అందింది. భక్తులకు ఇబ్బంది లేకుండా చర్యలు చేపడతాం. ప్రతి బస్సులోనూ టిక్కెట్ జారీ చేసేలా మార్పులు తీసుకువస్తాం.

- జగదీష్, డీపీటీవో

రాజ్యాంగం ప్రజాస్వామ్య స్ఫూర్తికి ప్రతీక

తిరుపతి, నవంబరు 26 (ఆంధ్రజ్యోతి) : రాజ్యాంగం ప్రజాస్వామ్య స్ఫూర్తికి ప్రతీక అని, రాజ్యాంగం నిబంధలను ప్రతి ఒక్కరూ అనుసరించాలని తిరుపతి జిల్లా ఇన్‌చార్జి జాయింట్ కలెక్టర్, నగరపాలక సంస్థ కమిషనర్ ఎన్.మౌర్య పిలుపునిచ్చారు. 76వ భారత రాజ్యాంగ ఆమోద దినోత్సవాన్ని బుధవారం నగరపాలక సంస్థ కార్యాలయంలో నిర్వహించారు. అంబేడ్కర్ చిత్ర పటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. డిప్యూటీ మేయర్ ముద్ర నారాయణ, మునిసిపల్ ఇంజినీర్ గోమతి, హెల్త్ ఆఫీసర్ డాక్టర్ యువ అన్వేష్, రెవిన్యూ అధికారులు సేతు మాధవ్, రవి పాల్గొన్నారు.

● **తుడాలో...**

తుడా కార్యాలయంలో చైర్మన్ దివాకర్ రెడ్డి, కార్యదర్శి డాక్టర్ శ్రీకాంత్‌బాబు తదితరులు పాల్గొని రాజ్యాంగ నిబంధనలు పాటించాలని ప్రమాణం చేశారు.

టాస్క్‌ఫోర్సు కార్యాలయంలో..

మంగళం, నవంబరు 26(ఆంధ్రజ్యోతి): రాజ్యాంగ అవతరణ దినోత్స వంలో భాగంగా తిరుపతి టాస్క్‌ఫోర్సు కార్యాలయంలో బుధవారం అధికారులు, సిబ్బందితో టాస్క్‌ఫోర్సు ఎస్పీ శ్రీనివాస్ రాజ్యాంగ ప్రమాణం చేయించారు. ప్రజాస్వామ్య వ్యవస్థను బలోపేతం చేయడంలో పోలీసులు ప్రముఖ పాత్ర వహించాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఏఎస్పీ కులశేఖర్, డీఎస్పీలు శ్రీనివాసరెడ్డి, ఎండీ షరీఫ్, ఏసీఎఫ్‌జే శ్రీనివాస్, సీఐ ఖాదర్‌బాషా ఆర్ఐ సాయిగిరిధర్, ఎస్ఐ రఫీ పాల్గొన్నారు.



అంబేడ్కర్ చిత్రపటానికి నివాళి అర్పిస్తున్న పోలీసులు

రాజ్యాంగంపై అవగాహన పెంచుకోవాలి



అంబేడ్కర్ విగ్రహానికి నివాళి అర్పిస్తున్న శివశంకర్, అధికారులు

తిరుపతి(ఆటోనగర్), నవంబరు 26 (ఆంధ్రజ్యోతి): రాజ్యాంగం పట్ల ప్రతి ఒక్కరూ అవగాహన పెంచుకుని భావితరాలకు వివరించాలని సదరన్ డిస్కం సీఎండీ లోతేటి శివశంకర్ పేర్కొన్నారు. బుధవారం సదరన్ డిస్కం కార్యాలయంలో రాజ్యాంగ దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. కార్యాలయ ప్రాంగణంలో ఉన్న బీఆర్ అంబేడ్కర్ విగ్రహానికి పూలమాల వేసి, నివాళులర్పించారు. అనెక్స్ భవనంలో ఏర్పాటు చేసిన ఎగ్జిబిషన్‌ను తిలకించారు. రాజ్యాంగ రూపకల్పనలో అంబేడ్కర్ సేవలను కొనియాడారు. రాజ్యాంగం పట్ల ప్రతి ఉద్యోగీ అవగాహన పెంచుకుని పిల్లలకు తెలియజేయాలని వెల్లడించారు. జాతీయగీతం ఆలాపించారు. సంస్థ డైరెక్టర్లు పి.అయూబ్‌ఖాన్, కె.గురవయ్య, కె.రామమోహన్‌రావు, సీజీఎంలు ఎన్.శోభావాలంటీనా, జె.రమణాదేవి, ఎం.మురళీ కుమార్, జానకిరామ్, సురేంద్రనాయుడు, ఎం.ఉమాపతి. చీఫ్ విజిలెన్స్ అధికారి కె.జనార్దననాయుడు, జీఎంలు ఎం.కృష్ణారెడ్డి, విజయన్, చక్రపాణి పాల్గొన్నారు.

రాజ్యాంగ సూత్రాలు సామాన్యులకు చేరాలి



పుస్తకావిష్కరణ చేస్తున్న ప్రముఖులు

తిరుపతి (విశ్వవిద్యాలయాలు), నవంబరు 26 (ఆంధ్రజ్యోతి): దేశ సర్వతోముఖాభివృద్ధికి ఉన్నతాశయంతో మేధావులు రూపొందించిన భారత రాజ్యాంగాన్ని సంక్షిప్తంగా రచించి సామాన్య ప్రజలకు అందుబాటులోకి తీసుకురావడం హర్షించదగ్గ పరిణామమని మాజీ ఎమ్మెల్సీ బి.చెంగల్రాయులు పేర్కొన్నారు. తిరుపతి వేమన విజ్ఞాన కేంద్రంలో మాజీ ఎమ్మెల్సీ, జన విజ్ఞాన వేదిక రాష్ట్ర అధ్యక్షుడు కే.ఎస్.లక్ష్మణరావు రచించిన భారత రాజ్యాంగం సంక్షిప్తంతో పాటు బాలల కోసం భారత రాజ్యాంగ ప్రవేశిక పుస్తకాలను బుధవారం ఆవిష్కరించారు. చెంగల్రాయులు మాట్లాడుతూ రాజ్యాంగంలో ఉన్న మౌలిక సూత్రాలను, సంక్లిష్టమైన సమాచారాన్ని ప్రజలు అర్థం చేసుకోవడానికి వీలుగా రచించిన రచయిత స్ఫూర్తిని కొనియాడారు. లక్ష్మణరావు రచించిన మరో 'పుస్తకం బాలల కోసం భారత రాజ్యాంగ ప్రవేశికను ఆవిష్కరించిన శ్రీకాళహస్తి దేవస్థానం కార్య నిర్వహణాధికారి బాపిరెడ్డి మాట్లాడుతూ.. చిన్న వయసు నుంచే భారత రాజ్యాంగం పట్ల మక్కువను పెంచుకోవడానికి లక్ష్మణ రావు చేసిన కృషి హర్షణీయమని తెలియజేశారు. వేమన విజ్ఞాన కేంద్రం అధ్యక్షుడు మల్లారపు నాగార్జున అధ్యక్షత వహించిన ఈ సమావేశంలో యూటీఎఫ్ రాష్ట్ర కార్యదర్శి ఎస్ఎస్ నాయుడు, ప్రముఖ చార్టెడ్ అకౌంటెంట్ శివన్నాయుడు, జనవిజ్ఞాన వేదిక రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సురేష్, తిరుపతి బాలోత్సవం కార్యదర్శి నడ్డి నారాయణ, యూటీయఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి ముత్యాల రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

హోంగార్డు కుటుంబానికి ఆర్థిక సాయం



హోంగార్డు కుటుంబానికి సాయం అందిస్తున్న ఎస్పీ సుబ్బరాయుడు

తిరుపతి (నేరవిభాగం), నవంబరు 26(ఆంధ్రజ్యోతి): హోంగార్డుగా పనిచేస్తూ మృతి చెందిన రమేష్‌బాబు కుటుంబానికి ఎస్పీ సుబ్బరాయుడు బుధవారం ఆర్థిక సాయం అందించారు. ఎస్పీ కార్యాలయంలో అతని కుటుంబ సభ్యులను పరామర్శించి, రూ.5 లక్షల చెక్కు అందచేశారు. రమేష్‌బాబు తిరుపతి యూనిట్‌లో ఎంటీ సెక్షన్‌లో డ్రైవర్‌గా పుత్తూరులో విధులు నిర్వహించేవాడు. గత ఏడాది జూన్ 15న గుండెపోటుతో మృతి చెందాడు. ఈ కార్యక్రమంలో అదనపు ఎస్పీ ఇన్‌చార్జి శ్రీనివాసులు, ఏవో రమేష్, డీఎస్పీ చిరంజీవి పాల్గొన్నారు.

అవిశ్వాస తీర్మానం విరమించుకోవాలి



మీడియాతో మాట్లాడుతున్న సరస్వతమ్మ

తిరుపతి(జీవకోన), నవంబరు 26 (ఆంధ్రజ్యోతి): నెల్లూరు నగరపాలక సంస్థ మేయర్ పొట్లూరి స్రవంతిపై అవిశ్వాస తీర్మానాన్ని విరమించుకోవాలని యానాది సంఘాల మహాకూటమి రాష్ట్ర మహిళా చైర్మన్, మాజీ ఆర్డీవో సరస్వతమ్మ డిమాండ్ చేశారు. తిరపతి ప్రెస్‌క్లబ్‌లో బుధవారం ఆమె మాట్లాడుతూ 40 ఏళ్ల తర్వాత ఎస్టీ యానాది కులానికి నెల్లూరు మేయర్ పదవి అవకాశం వచ్చిందని, నాలుగేళ్లు బాగా పాలన అందించినా చివరి సంవత్సరంలో అవిశ్వాస తీర్మానం ప్రవేశపెట్టడం సరికాదన్నారు. వెంటనే ఈ తీర్మానాన్ని ఉపసంహరించుకోవాలన్నారు. ఈ సమావేశంలో యానాది సంఘాల నేతలు పెంచలయ్య, ముక్తేశ్వరరావు, శేఖర్, కోటయ్య, శ్రీహరి, బుజ్జయ్య తదితరులు పాల్గొన్నారు.

పికిల్‌బాల్ కోర్టు ప్రారంభం

తిరుపతి(క్రీడలు), నవంబరు 26(ఆంధ్రజ్యోతి): నగర శివారు ప్రాంతం మంగళంలోని ఎంజీ ఇండోర్ స్పోర్ట్స్‌హబ్‌లో నూతనంగా ఏర్పాటు చేసిన పికిల్‌బాల్ కోర్టును శాప్ చైర్మన్ రవినాయుడు బుధవారం ప్రారంభించారు. ఆయన మాట్లాడుతూ ఆధునిక క్రీడలు యువత దిశను మార్చడంలో కీలకపాత్ర పోషిస్తున్నాయన్నారు. తిరుపతిలో ఇలాంటి సదుపాయాలు కల్పించడం అభినందనీయమన్నారు. ఈ కార్యక్రమంలో ఎంజీ హబ్ యజమాని వెంకటేష్, మహేష్ తదితరులు పాల్గొన్నారు.



కోర్టును ప్రారంభిస్తున్న రవినాయుడు

అంబేడ్కర్‌కు ఘన నివాళి



అంబేడ్కర్ విగ్రహానికి నివాళి అర్పిస్తున్న కమిటీ ప్రతినిధులు

తిరుపతి అర్బన్, నవంబరు 26 (ఆంధ్రజ్యోతి): భారత రాజ్యాంగ దినోత్సవాన్ని పురస్కరించుకుని చల్లప్పమేస్త్రి మెమోరియల్ అంబేడ్కర్ భవన్ కమిటీ ఆధ్వర్యంలో బుధవారం ఉదయం స్థానిక ఆర్టీసీ బస్టాండు వద్ద అంబేడ్కర్ విగ్రహానికి నివాళి అర్పించారు. కమిటీ చైర్మన్ పరమశివం మాట్లాడుతూ అన్ని వర్గాలకు సమాన అధికారం లభించేలా రాజ్యాంగాన్ని రూపొందించిన గొప్ప వ్యక్తి అంబేడ్కర్ అని కొనియాడారు. ఈ కార్యక్రమంలో సంఘం కార్యదర్శి నాగేశ్వరరావు, మురళి, చిరంజీవి, రామచంద్రయ్య పాల్గొన్నారు.



అంబేడ్కర్ విగ్రహానికి పుష్పాంజలి ఘటిస్తున్న అధికారులు

తిరుపతి (విశ్వవిద్యాలయాలు), నవంబరు 26 (ఆంధ్రజ్యోతి): రాజ్యాంగ దినోత్సవం సందర్భంగా ఎస్వీయూలో అంబేడ్కర్‌కు వీసీ నరసింగరావు, రెక్టార్ అప్పారావు, రిజిస్ట్రార్ భూపతి నాయుడు పుష్పాంజలి ఘటించారు. వర్సిటీ ప్రాంగణంలో ఆయన విగ్రహానికి నివాళి అర్పించి, రాజ్యాంగ దినోత్సవం నిర్వహించారు. రాజ్యాంగం ద్వారా స్వేచ్ఛ, సమానత్వ భావనలను అంబేడ్కర్ కాపాడారన్నారు. ప్రిన్సిపాళ్ళు సుధారాణి, పద్మావతి, వెంకటేశ్వర్లు, శ్రీనివాసులు, యూనివర్సిటీ సెంట్రల్ లైబ్రరీ డైరెక్టర్ సురేంద్రబాబు పాల్గొన్నారు.




శైలేష్ కొలను - కేతిరెడ్డి జగదీశ్వర్‌రెడ్డి

కొత్త ప్రాజెక్ట్ కోసం స్వామి ఆశీస్సులు తీసుకున్నా

తిరుమల, నవంబరు26(ఆంధ్రజ్యోతి): త్వరలో కొత్త ప్రాజెక్ట్‌ను ప్రారంభించనున్న క్రమంలో స్వామి ఆశీస్సులు తీసుకున్నానని 'హిట్' సినిమాల దర్శకుడు శైలేష్ కొలను వెల్లడించారు. తిరుమల శ్రీవారిని బుధవారం ఉదయం తన నూతన ప్రాజెక్ట్ స్క్రిప్ట్‌తో ఆయన దర్శించుకున్నారు. సితార ఎంటర్టైన్మెంట్ నాగవంశీతో నూతన సినిమా ప్రారంభంకానుందన్నారు.

● తమిళనాడు తెలుగు యువశక్తి అధ్యక్షుడు, తెలుగు ఫిల్మ్ ప్రొడ్యూసర్ కౌన్సిల్ అధ్యక్షుడు కేతిరెడ్డి జగదీశ్వర్‌రెడ్డి కూడా తిరుమల శ్రీవారిని దర్శించుకున్నారు.

4న తిరుమలలో కార్తీక దీపోత్సవం

తిరుమల, నవంబరు26(ఆంధ్రజ్యోతి): తిరుమల శ్రీవారి ఆలయంలో డిసెంబరు 4వ తేది కార్తీక పర్వ దీపోత్సవాన్ని టీటీడీ నిర్వహించనుంది. శ్రీవారికి సాయంకాల కైంకర్యాలు, నివేదనలు పూర్తయ్యాక ఆలయంలోపల, బయట అనుబంధ ఆలయాలు, పుష్కరిణి వద్ద నేతి వత్తులతో దీపాలను వెలిగిస్తారు.

హత్యకేసులో లొంగిపోయిన నిందితుడు

పాకాల, నవంబరు 26 (ఆంధ్రజ్యోతి): పాకాల మండలం దామలచెరువుకు చెందిన మామిడి సప్లయర్, మెడికల్ షాప్ యజమాని ఈ యేడాది మే 1వ తేదీన దారుణహత్యకు గురైన సంఘటనలో మూడో నిందితుడు తిరుమల రాజు బుధవారం పాకాల జూనియర్ సివిల్ జడ్జి కోర్టులో లొంగిపోయాడు. న్యాయమూర్తి పూర్ణిమదేవి నిందితుడికి 14 రోజులు రిమాండు విధించారు. ఈ మేరకు పోలీసులు చిత్తూరు సబ్‌జైలుకు నిందితుడిని తరలించారు.

సర్వదర్శనానికి 12 గంటలు

తిరుమల వేంకటేశ్వరస్వామి దర్శనానికి 12 గంటల సమయం పడుతోంది. బుధవారం సాయంత్రం 4 గంటల వరకు ఉన్న సమాచారం మేరకు వైకుంఠం క్యూకాంప్లెక్స్2లో 31 కంపార్టుమెంట్లలో, నారాయణగిరిలోని 2 షెడ్లలో సర్వదర్శన భక్తులు, వైకుంఠం క్యూకాంప్లెక్స్1లో 5 కంపార్టుమెంట్లలో టైంస్లాట్ భక్తులు వేచి ఉన్నారు.

సోమవారం హుండీ ఆదాయం: రూ.3.26 కోట్లు

మంగళవారం శ్రీవారిని దర్శించుకున్న భక్తులు: 73,677

తలనీలాలు సమర్పించినవారు: 24,732



కాంచిన కనులదే భాగ్యం



పూలబుట్టలతో ఊరేగింపుగా టీటీడీ అధికారులు



● అమ్మవారికి వేడుకగా పుష్పయాగం

తిరుచానూరు, నవంబరు 26(ఆంధ్రజ్యోతి): జాజులు, తామరలు, మల్లెలు, కలువలు, చామంతి, రోజా, మొల్లలు, కనకాంబరాలు, మొగలి రేకులు తదితర 12 రకాల పుష్పాలు. తులసి, మరువం, దవణం, బిల్వం, కదిర పచ్చ, పన్నీరు తదితర ఆరు రకాల పత్రాలు. వీటితో తిరుచానూరు పద్మావతి అమ్మవారికి బుధవారం అర్చకులు పుష్పయాగం నిర్వహించారు. కార్తీక బ్రహ్మోత్సవాల్లో జరిగిన ఆగమయుక్త కార్యక్రమాల్లో తెలిసో తెలియకో చోటు చేసుకున్న దోషాలకు ప్రాయశ్చిత్తంగా.. ఉత్సవాలు ముగిసిన మరుసటిరోజు పుష్పయాగం నిర్వహించడం ఆనవాయితీ. ఇందులో భాగంగా దాతల ద్వారా సేకరించిన నాలుగు టన్నుల పుష్పాలు, పత్రాలను గంపల్లో అమర్చి ఆస్థాన మండపంలో పూజలు నిర్వహించారు. ఆలయ ఉద్యోగులు, శ్రీవారి సేవకులు ఈ గంపలను ఊరేగింపుగా ఆలయానికి తీసుకొచ్చారు. మధ్యాహ్నం 3గంటలకు యాగశాలలో ప్రాయశ్చిత, శాంతిహోమం, పూర్ణాహుతి నిర్వహించారు. సాయంత్రం 5గంటలకు సన్నిధి నుంచి అమ్మవారిని వేంచేపుగా శ్రీకృష్ణ స్వామి ముఖమండపంలో కొలువు దీర్చారు. 8గంటల వరకు వేదమంత్రాలు పఠిస్తూ పుష్పాలను అమ్మవారిపై చల్లుతూ పుష్పాభిషేకం చేశారు. ఈ నాలుగు టన్నుల పుష్పాలను ఏపీ, తమిళనాడు, కర్ణాటక రాష్ట్రాల నుంచీ దాతలు వితరణగా అందించినట్లు టీటీడీ ఉద్యానశాఖ అధికారిడిప్యూటీ డైరెక్టర్ శ్రీనివాసులు తెలిపారు. కార్యక్రమంలో ఆలయ డిప్యూటీ ఈవో హరీందర్‌నాథ్, ఏఈవో దేవరాజులు, ఏవీఎస్వో రాధాకృష్ణమూర్తి, అర్చకులు బాబుస్వామి, మణికంఠస్వామి, సూపరింటెండెంట్లు రమేష్, టెంపుల్ ఇన్‌స్పెక్టర్ ప్రసాద్, చలపతి, సుబ్బరాయుడు సుభాస్కర్‌నాయుడు తదితరులు పాల్గొన్నారు.

నేడు పుట్టింటి ఆతిథ్యం

పద్మావతీ అమ్మవారికి గురువారం మహంతు ఉత్సవాన్ని నిర్వహించనున్నారు. బ్రహ్మోత్సవాలు ముగిసిన రెండో రోజు అమ్మవారు తన పుట్టింటికి వెళ్లి ఆతిథ్యం స్వీకరించడంలో భాగంగా పద్మసరోవరం వద్దనున్న హథీరాంమఠంలోని ఆంజనేయస్వామి ఆలయంలో ఉత్సవాన్ని నిర్వహిస్తారు. కాగా, గురువారం నుంచి అమ్మవారి ఆలయంలో యథావిధిగా ఆర్జిత సేవలు జరుగుతాయని అధికారులు తెలిపారు.

నీకొకటి.. నాకొకటి

● అప్పుడు వారు.. ఇప్పుడు వీరు

● రుయాలో రెండు మెడికల్ షాపులను పంచుకున్న నేతలు

తిరుపతి, నవంబరు 26(ఆంధ్రజ్యోతి): స్విమ్స్‌లో మెడికల్ మాఫియాకు బ్రేక్ పడిందని అనుకునేలోపే, పక్కనే ఉన్న రుయాస్పత్రికి విస్తరించింది. రాజకీయ నేతల ఒత్తిళ్లతో బుధవారం రెండు జనరిక్ మెడికల్ షాపులకు అనుమతిస్తూ నోట్‌ఫైల్ సిద్ధమైనట్లు తెలిసింది. ఇరు పార్టీలకు చెందిన ఇద్దరు ప్రజాప్రతినిధులు సిఫారసు లేఖలతో రెండు మెడికల్ షాపులను నామమాత్రపు అద్దెకు ఇచ్చేందుకు రంగం సిద్ధమైంది. ఏకంగా రుయాలోని స్థలం కేటాయించి గదులను వారినే కట్టుకోమని సూచించినట్టు సమాచారం. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక రుయాస్పత్రిలో మెడికల్ షాపులకోసం నలుగురు నాయకుల నుంచి నాలుగు దరఖాస్తులు ఏడాది క్రితమే అధికారులకు అందాయి. ప్రతి ప్రభుత్వ వైద్యశాలలో జనరిక్ మెడికల్ షాపు ఉండాలని, వాటిని రెడ్‌క్రాస్ సొసైటీ మాత్రమే నిర్వహించాలని మే నెలలో రాష్ట్ర ప్రభుత్వం జీవో విడుదల చేసింది. దీంతో అధికారులు బయట వ్యక్తులకు కేటాయించలేకపోయారు.

ఇదిలావుంటే 2005లో టెండరు ద్వారా దక్కించుకున్న రెండు ప్రైవేట్ మెడికల్ షాపులు 2019వరకు రుయాకు అద్దెచెల్లిస్తూ నిర్వహించుకుంటూ వచ్చాయి. వైసీపీ అధికారంలోకి వచ్చాక బలవంతంగా ఖాళీ చేయించి, ఆపార్టీ అనుచరులకు కట్టబెట్టారన్న విమర్శలు వచ్చాయి. కూటమి ప్రభుత్వం వచ్చిన తర్వాత కోర్టును ఆశ్రయించి మళ్ళీ వాటిని పూర్వపు నిర్వాహకులే చేజిక్కించుకుని ఇటీవల ప్రారంభించారు. ఈ రెండు కాకుండా మరొకటి రెడ్ క్రాస్ సొసైటీ జనరిక్ మెడికల్ షాపు నిర్వహిస్తోంది. జీవో నెంబరు 516 నిబంధనల మేరకు వెయ్యి పడకలు దాటిన ఆస్పత్రిలో మూడు మెడికల్ షాపులు మాత్రమే ఉండాలి. ఆ మేరకు రుయాస్పత్రిలో ప్రస్తుతం 3 మెడికల్ షాపులు ఉన్నాయి. నిబంధనలకు విరుద్ధంగా మరో రెండు షాపులు కేటాయిస్తే రుయాలో మొత్తం 5 మెడికల్ షాపులు ఉన్నట్టు అవుతుంది. రాజకీయ ఒత్తిళ్లను తట్టుకోలేకనే రుయా అధికారులు మెడికల్ షాపులను కేటాయిస్తున్నట్టు తెలుస్తోంది. నిబంధనలకు విరుద్ధంగా అప్పగిస్తున్న మెడికల్ షాపులను హాస్పిటల్ డెవలప్మెంట్ కమిటీ చైర్మన్‌గా వ్యవహరించే కలెక్టర్ అనుమతి తీసుకున్నారా? లేదా? అన్న అనుమానం కలుగుతోంది.

నేడు ప్రముఖ రచయిత్రి ఓల్గా రాక

● తండ్రి పేర పద్మావతి వర్సిటీలో ధర్మనిధి సదస్సు

తిరుపతి (విశ్వవిద్యాలయాలు), నవంబరు 26 (ఆంధ్రజ్యోతి): పద్మావతి మహిళా యూనివర్సిటీ తెలుగు విభాగానికి గురువారం ప్రముఖ రచయిత్రి ఓల్గా రానున్నారు. తన తండ్రి పోపూరి వేంకట సుబ్బారావు పేర ఏటా ఏటా ధర్మనిధి సదస్సులో ఆమె పాల్గొంటారు. గురువారం ఉదయం 10 గంటలకు సావేరీ హాల్లో ఈ కార్యక్రమం ప్రారంభం కానుంది.

రైల్వే అధికారి మృతి

తిరుపతి (నేరవిభాగం), నవంబరు 26(ఆంధ్రజ్యోతి): తిరుపతిలో బుధవారం గుండెపోటుతో రైల్వే అధికారి మృతి చెందారు. తిరుపతి ఈస్ట్ ఎస్‌ఐ రామాంజనేయులు తెలిపిన ప్రకారం.. ఏర్పేడు మండలం అంజిమేడుకు చెందిన మల్లిఖార్జునరెడ్డి (57)హైదరాబాదులో రైల్వే ఆఫీసు సూపరింటెండెంట్‌గా పనిచేస్తున్నారు. బుధవారం హైదరాబాదు నుంచి తిరుపతికి వచ్చారు. ఈ క్రమంలో రేణిగుంటలో దిగి టీ తాగి బంధువులతో ఫోన్‌లో మాట్లాడాడు. తిరుపతికి బస్సు చేరుకున్నా.. ఎంతసేపటికీ ఆయన దిగలేదు. అనుమానం వచ్చిన బస్సు డ్రైవర్ అతడి వద్దకు వెళ్ళి చూడగా సొమ్మసిల్లి పడి ఉన్నారు. వెంటనే ఆస్పత్రికి తరలించగా, అప్పటికే మృతిచెందినట్లు వైద్యులు ధ్రువీకరించారని ఎస్‌ఐ చెప్పారు. జరిగిన ఘటనపై మృతుడు సోదరుడు దశరధరామయ్యకు సమాచారం ఇచ్చారు. అతడి ఫిర్యాదుతో కేసు నమోదు చేసి శవాన్ని పోస్టుమార్టం నిమిత్తం రుయాకు తరలించారు.

సామాజిక సేవా కార్యక్రమాలకు ప్రాధాన్యం

● ఎన్‌సీసీ ఏపీ-టీజీ డీడీజీ నర్సింగ్ సైలాని

● గిరిపురాన్ని దత్తత తీసుకున్న ఎన్‌సీసీ తిరుపతి గ్రూపు



తిరుపతి (విశ్వవిద్యాలయాలు), నవంబరు 26 (ఆంధ్రజ్యోతి): ఇకపై సామాజిక సేవా కార్యక్రమాలకు ఎక్కువ ప్రాధాన్యం ఇస్తామని ఎన్‌సీసీ ఏపీ, తెలంగాణ రాష్ట్రాల డిప్యూటీ డైరెక్టర్ జనరల్ (డీడీజీ) నర్సింగ్ సైలాని పేర్కొన్నారు. తిరుపతి ఎన్‌సీసీ గ్రూపును బుధవారం ఆయన సందర్శించారు. పచ్చదనం, పరిశుభ్రత వంటి కార్యక్రమాల్లో ఎన్‌సీసీ క్యాడెట్లు పాల్గొనేలా చేస్తామన్నారు. తద్వారా ఎన్‌సీసీ క్యాడెట్లలో సేవా స్ఫూర్తి, నాయకత్వ లక్షణాల పెంపు, సామాజిక బాధ్యత అలవడేలా చూస్తామన్నారు. తిరుపతిలోని గిరిపురం ప్రాంతాన్ని ఎన్‌సీసీ తిరుపతి గ్రూపు దత్తత తీసుకుంది. నగరపాలక సంస్థ సహకారంతో పరిశుభ్రత, వ్యర్థాల నిర్వహణపై ఈ ప్రాంతంలోని ప్రజల్లో అవగాహన కల్పిస్తామని సైలానీ తెలిపారు. ఈ సమావేశంలో ఎంసీటీ ఆరోగ్యాధికారి అన్వేష్, ఎన్‌సీసీ అధికారులు సతీష్ దాహియా, ప్రసన్న తదితరులు పాల్గొన్నారు.

కారు, బస్సు ఢీ ● ఐదుగురికి తీవ్ర గాయాలు

పుత్తూరు అర్బన్, నవంబరు 26(ఆంధ్రజ్యోతి): పుత్తూరు సమీపంలోని పరమేశ్వర మంగళం వద్ద కారు, బస్సు ఢీ కొన్నాయి. శ్రీకాళహస్తి నుంచి కంచికి వెళుతున్న కారు వాహనాన్ని అధిగమించబోయి కంచి నుంచి వస్తున్న తమిళనాడు ఆర్టీసీ బస్సును ఢీ కొంది. ఈ ప్రమాదంలో బస్సులోని ఐదుగురు ప్రయాణికులకు తీవ్రంగాను.. కారులో ప్రయాణిస్తున్న వారికి చిన్నపాటి గాయాలైనట్టు పోలీసులు తెలిపారు. కేసు నమోదు చేసి క్షతగాత్రులకు ప్రథమ చికిత్స చేయించి కాంచీపురం ఆస్పత్రికి పంపామన్నారు.

సెప్టిక్‌ట్యాంకు క్లీనింగ్ వాహనానికి దరఖాస్తు చేసుకోండి

తిరుపతి(కలెక్టరేట్), నవంబరు 26 (ఆంధ్రజ్యోతి): తిరుపతిజిల్లా పరిధిలో సెప్టిక్ ట్యాంక్ క్లీనింగ్ వాహనాన్ని ఎన్‌ఎస్‌కేఎఫ్‌డీసీ పథకం కింద పొందేందుకు దరఖాస్తు చేసుకోవాలని షెడ్యూల్డ్ కులాల సేవాసహకార సంఘం కార్యనిర్వాహక సంచాలకుడు విక్రమ్‌కుమార్‌రెడ్డి కోరారు. ఈ మేరకు బుధవారం ఒక ప్రకటన విడుదల చేశారు. 'జిల్లాలోని ఎస్సీలకు చెందిన సఫాయి కర్మాచారి వృత్తిలో ఉన్న వారు అర్హులు. ఈనెల 30వ తేదీ లోపు దరఖాస్తులు పంపాలి. మరిన్ని వివరాలకు 91007 56863 నెంబరులో సంప్రదించాలి' అని ఆ ప్రకటనలో పేర్కొన్నారు.

టీటీడీ మాజీ ఏవీఎస్వో కుటుంబానికి స్నేహితుల సాయం

తిరుపతి, నవంబరు 26(ఆంధ్రజ్యోతి):ఇటీవల అనుమానాస్పద స్థితిలో మృతిచెందిన టీటీడీ మాజీ ఏవీఎస్వో, జీఆర్పీ సీఐ వై. సతీష్ కుమార్ కుటుంబానికి ఆయన స్నేహితులు సాయమందించారు. 2012 ఏఆర్ అండ్ ఏపీఎస్పీ బ్యాచ్‌కు చెందిన సతీష్ కుమార్ ఈనెల 15వ తేది తిరుమల పరకామణి కేసు విచారణకు హాజరయ్యేందుకు రైల్లో బయల్దేరి అనూహ్యరీతిలో పట్టాలపై శవంగా దర్శనమివ్వడం సంగతి తెలిసిందే.ఈ నేపథ్యంలో బుధవారం సతీష్‌కుమార్ కర్మక్రియలకు హాజరైన ఆయన బ్యాచ్‌మేట్స్ అంతా కలసి కుటుంబానికి ఆర్థికసాయమందించారు.సతీష్‌కుమార్ తల్లి పేరిట 3లక్షలు, పిల్లల పేరిట 11లక్షలు చెక్కుల రూపంలో అందజేశారు. ఏపీ, తెలంగాణలకు చెందిన బ్యాచ్‌మేట్స్ మోడెం సురేష్, అర్జున్, నరసింహ, విజయకుమార్, షరీఫ్, రంగనాథ్, మాదప్పమనోహర్, శ్రీనివాస్, ప్రదీప్,సుధాకర రెడ్డి, శ్రీనివాసులు పాల్గొన్నారు.



తిరుమల కొండల్లో ఏనుగుల జాడను గుర్తిస్తున్న వైల్డ్‌లైఫ్ ఇన్‌స్టిట్యూట్ బృందం

'గజ' గమనం పరిశోధిస్తున్నాం

● వైల్డ్ లైఫ్ ఇండియా ప్రాజెక్టు అసోసియేట్ బాలాజీ

మంగళం, నవంబరు 26(ఆంధ్రజ్యోతి): తిరుపతి, చిత్తూరు జిల్లాల్లో ముఖ్యంగా తిరుమల అటవీప్రాంతాల్లో గజరాజులు ఎలా వస్తున్నాయి? ఎక్కడికి వెళుతున్నాయి? అనే దానిపై అధ్యయనం చేయడానికి వచ్చామని వైల్డ్‌లైఫ్ ఇండియా అసోసియేట్ బాలాజీ చెప్పారు. బుధవారం డెహ్రాడూన్ నుంచి ఆరుగురు సభ్యులతో కూడిన బృందం, తిరుపతికి చెందిన ఒక బయాలజిస్టు, ఐదుగురు ప్రొటెక్షన్ వాచర్లు తిరుమల కొండల్లో పర్యటించారు. తిరుమల కొండల్లో నుంచి భాకారపేట, మామండూరు, పరిసర ప్రాంతాల్లోకి ఏనుగులు రాకపోకలు సాగిస్తున్నట్లు గుర్తించారు. ఈ ప్రాంతాల్లో ఉన్న ఏనుగులు.. వీటిలో ఆడ, మగ ఎన్ని? ఎక్కువ కాలం ఏ ప్రాంతంలో ఉంటున్నాయనే అంశాలను అధ్యయనం చేస్తామన్నారు. వీటికి ఆహారం, నీరు లభించే ప్రాంతాలను కూడా పరిశీలిస్తామన్నారు. ఏనుగుల పాదముద్రలు, వాటి విసర్జకాలను కూడాపరిశీలిస్తామని చెప్పారు. ఏనుగుల ట్రాకింగ్‌పై పూర్తి అవగాహన వచ్చాక అటవీప్రాంతాల నుంచి జనంలోకి, పంట పొలాల్లోకి రాకుండా ఎలా నియంత్రించాలనే దానిపై త్వరలో నిర్ణయం తీసుకుంటామని ఆయన చెప్పారు.

నాలుగు లేబర్‌కోడ్, అగ్రి నల్లచట్టాలు రద్దు చేయాలి

● వామపక్షాలు, రైతు కార్మిక సంఘాల డిమాండ్ ● కలెక్టరేట్ వద్ద కార్మిక సంఘాల ఆందోళన



కలెక్టరేట్ వద్ద ధర్నా చేస్తున్న వామపక్షాల నాయకులు

తిరుపతి(కలెక్టరేట్), నవంబరు 26 (ఆంధ్రజ్యోతి): కేంద్ర ప్రభుత్వం తీసుకొచ్చిన నాలుగు లేబర్ కోడ్, మూడు వ్యవసాయ నల్ల చట్టాలను రద్దు చేయాలని వామపక్షాలకు చెందిన కార్మిక సంఘాలు డిమాండ్ చేశాయి. కలెక్టరేట్ వద్ద బుధవారం ఏఐటీయూసీ, సీఐటీయూ, ఐఎఫ్‌టీయూ, రైతు సంఘాలు ఆందోళన నిర్వహించాయి. కేంద్ర ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలు చేశారు. సీఐటీయూ రాష్ట్ర ఉపాధ్యక్షుడు కందారపు మురళి, సీపీఐ జిల్లా కార్యదర్శి పి.మురళి, సీపీఐ ఎంఎల్ నగర కార్యదర్శి వెంకటరత్నం మాట్లాడుతూ ఎప్పుడో పార్లమెంట్‌లో ఆమోదించిననాలుగు లేబర్ కోడ్‌ను అమలు బీహార్ ఎన్నికల తర్వాత అమల్లోకి వస్తాయని ఆర్డినెన్సు విడుదల చేయడం దుర్మార్గమన్నారు. వ్యవసాయ నల్లచట్టాల రద్దుకోసం ఉద్యమించిన రైతాంగానికి క్షమాపణ చెప్పి ఉపసంహరించుకుంటామన్న ప్రధాని మోదీ.. ఇప్పుడా మాట విస్మరించారని ధ్వజమెత్తారు. రాష్ట్రంలోనూ పదిగంటలకుపైగా పనిచేయించుకోవచ్చని అసెంబ్లీలో తీర్మానం చేయడం దుర్మార్గమని ఏఐటీయూసీ, సీఐటీయూ జిల్లా అధ్యక్షులు చంద్రశేఖర్‌రెడ్డి, జయచంద్ర పేర్కొన్నారు. ఈ ఆందోళనలో రైతు సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షురాలు హేమలత, ప్రజానాట్యమండలి రాష్ట్ర కార్యదర్శి చిన్నం పెంచులయ్య, వివిధ కార్మిక సంఘాల నేతలు విజయకుమార్, రాజా, రవి, వేణుగోపాల్, రాధాకృష్ణ, సాయిలక్ష్మి, గంగ, శివకుమార్ తదితరులు పాల్గొన్నారు.

మహిళా సాధికారతలో పాడిపరిశ్రమది కీలక భూమిక

● జాతీయ పాలదినోత్సవంలో వెటర్నరీ వీసీ జేవీ రమణ



తిరుపతిరూరల్, నవంబరు 26 (ఆంధ్రజ్యోతి): మహిళా సాధికారతలో పాడిపరిశ్రమరంగం కీలక భూమిక పోషిస్తోందని ఎస్వీ వెటర్నరీ వర్సిటీ ఇన్‌చార్జి వీసీ జేవీరమణ పేర్కొన్నారు. శ్వేతవిప్లవ పితామహుడు డాక్టర్ వర్గీస్ కురియన్ జన్మదినాన్ని పురస్కరించుకుని ఇండియన్ డెయిరీ అసోసియేషన్ ఏపీ లోకల్ చాప్టర్, డెయిరీ టెక్నాలజీ కళాశాల సంయుక్త ఆధ్వర్యంలో బుధవారం నిర్వహించిన జాతీయ పాలదినోత్సవంలో ఆయన మాట్లాడారు. దేశంలో పాడి పరిశ్రమ అభివృద్ధి, మహిళాసాధికారితలో కురియన్ సేవలు మరువలేనివన్నారు. చిత్తూరుజిల్లా కుప్పం మండలం, గరిగచ్చినీపల్లెకి చెందిన చంద్రశేఖర్ నాగజ్యోతిని ఐడీఏ-ఏపీలోకల్ చాప్టర్ ద్వారా ఉత్తమ మహిళా పాడిరైతుగా ఎంపిక చేసి రూ.10వేల నగదు, సర్టిఫికెట్‌తో సన్మానించారు. అలాగే నగరంలోని అగ్రికల్చర్, వెటర్నరీ, డెయిరీ టెక్నాలజీ, ఎస్వీఆర్ట్స్ కళాశాల, పద్మావతి మహిళా వర్సిటీ విద్యార్థులకు పాల ఉత్పత్తిదారులకు మెరుగైన రాబడిని నిర్ధారించడం అనేఅంశంపై వక్తృత్వపోటీలు నిర్వహించారు. తొలిమూడుస్థానాలు సాధించిన విద్యార్థులకు బహుమతులు, సర్టిఫికెట్లు అందజేశారు. ఐడీఏ-ఏపీలోకల్ చాప్టర్ చైర్మన్ డాక్టర్ రవికుమార్, డెయిరీటెక్నాలజీ డీన్, లోకల్ చాప్టర్ కార్యదర్శి డాక్టర్ కె.నాగేశ్వరరావు, అసోసియేట్ డీన్ డాక్టర్ జి.గంగరాజు, డాక్టర్ మంజునాథ, అధ్యాపకులు తదితరులు పాల్గొన్నారు.

నిబంధనలను పాటించని వాహనదారులకు రూ.3.17 లక్షల జరిమానా

తిరుమల, నవంబరు26(ఆంధ్రజ్యోతి): ట్రాఫిక్ నిబంధనలను పాటించని వాహనదారులకు బుధవారం అధికారులు రూ.3.17 లక్షల జరిమాన విధించారు. తిరుపతి రవాణాశాఖ, ట్రాఫిక్ అధికారులు రెండు బృందాలుగా ఏర్పడి తిరుమల మొదటి, రెండవ ఘాట్‌రోడ్లలో బుధవారం ఆకస్మిక తనిఖీలు నిర్వహించారు. ఇందులో హెల్మెట్, సీట్ బెల్ట్ ధరించిన వారితో పాటు డ్రైవింగ్ లైసెన్స్, సరైన వాహనాల పత్రాలు లేని వారికి 105 చలానాల ద్వారా రూ.3.17 లక్షల జరిమాన విధించారు. నిత్యం రద్దీతో కూడిన తిరుమల క్షేత్రానికి వచ్చేవెళ్లేవారందరు తప్పనిసరిగా ట్రాఫిక్ నిబంధనలను పాటించాలని అధికారులు సూచించారు. ఈ దాడుల్లో ట్రాఫిక్ సీఐ హరిప్రసాద్, రవాణశాఖ అధికారులు శ్రీనివాసులు, అధిక నాజ్, స్వర్ణలత, వెంకటరమణ, ఆంజనేయప్రసాద్, సిబ్బంది పాల్గొన్నారు.

పుత్తూరులో తండ్రిపై కూతురు కిడ్నాప్ కేసు

పుత్తూరు అర్బన్, నవంబర్ 26(ఆంధ్రజ్యోతి): తనతో పాటు తన భర్తను కిడ్నాప్ చేయబోయాడని తండ్రిపై కూతురు పోలీసులకు ఫిర్యాదు చేసింది. ఈ మేరకు తండ్రి చంద్రబాబుపె పోలీసులు కిడ్నాప్ యత్నం కేసు నమోదు చేశారు. కల్యాణపురానికి చెందిన చంద్రబాబు పశు వైద్యుడు. కుటుంబ సమేతంగా కార్వేటినగరంలోని చర్చికి వెళ్లి ప్రార్థనలు నిర్వహించే వారు. ఈ క్రమంలో పవిత్ర ఎస్ఆర్‌పురం మండలం పొదలపల్లికి చెందిన గిరిప్రసాద్‌ను రెండు నెలల క్రితం తల్లిదండ్రుల సమ్మతి లేకుండా వివాహం చేసుకుంది. ఈక్రమంలో తల్లికి బాగాలేదని పవిత్రను పిలిపించిన చంద్రబాబు.. గిరిప్రసాద్‌ను కార్వేటినగరంలో రోడ్డులోని ఎస్ఎస్ బేకరి వద్ద నెంబర్ ప్లేట్ లేని కారులో తీసుకెళ్లే ప్రయత్నం చేశారు. ఈ క్రమంలో పెనుగులాట జరిగి, కారు నుంచి బయటపడిన పవిత్ర, గిరిప్రసాద్ పుత్తూరు పోలీస్‌స్టేషన్‌కు చేరుకుని ఫిర్యాదు చేశారు. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

జంతు మార్కెట్ యాప్ ఆవిష్కరణ



యాప్‌ను ప్రారంభిస్తున్న వీసీ నరసింగరావు తదితరులు

తిరుపతి (విశ్వవిద్యాలయాలు), నవంబరు 26 (ఆంధ్రజ్యోతి): ఎస్వీయూ ఇంజినీరింగ్ కాలేజీ కంప్యూటర్ సైన్స్ నాలుగో సంవత్సర విద్యార్థి ఎం.పూర్ణప్రసాద్ రూపొందించిన జంతు మార్కెట్ యాప్‌ను వీసీ నరసింగరావు, రెక్టార్ అప్పారావు, రిజిస్ట్రార్ భూపతి నాయుడు బుధవారం ప్రారంభించారు. అనంతరం వారు మాట్లాడుతూ.. పూర్ణచంద్ రూపొందించిన యాప్ ద్వారా జంతువులు, పశుగ్రాసం, పాల ఉత్పత్తులు, కూరగాయలు, పండ్లు, పంట ఉత్పత్తుల కొనుగోలు అమ్మకం, రైతులు పశు వైద్యులను సంప్రదించడానికీ, టీకా రిమైండ్ చేయడానికీ, పశువుల ధర వంటి వివరాలు పొందుపర్చినట్టు చెప్పారు. ఈ యాప్ రూపొందించడంలో ప్రొఫెసర్ వివేకానంద రెడ్డి మార్గదర్శకత్వం వహించారు. సీడీసీ డీన్ చెంద్రాయుడు, రీసెర్చ్ డీన్ నరసింహ, ప్రిన్సిపాళ్ళు శ్రీనివాసులు, సుధారాణి, వెంకటేశ్వర్లు, పద్మావతి పాల్గొన్నారు.

కలెక్టరేట్‌లో రాజ్యాంగ దినోత్సవం



అంబేడ్కర్ చిత్రపటానికి నివాళులు అర్పిస్తున్న అధికారులు

తిరుపతి(కలెక్టరేట్), నవంబరు 26(ఆంధ్రజ్యోతి): జిల్లా కలెక్టరేట్‌లో బుధవారం 76వ భారతరరాజ్యాంగ దినోత్సవాన్ని నిర్వహించారు. అంబేడ్కర్ చిత్రపటానికి అధికారులు పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. అనంతరం రాజ్యాంగ ప్రతిజ్ఞ చేశారు. ఈ కార్యక్రమంలో స్పెషల్ డిప్యూటీ కలెక్టర్లు దేవేంద్ర రెడ్డి, రోజ్మాండ్‌తో పాటు సుధారాణి, శివశంకర్‌నాయక్, కలెక్టరేట్ ఏవో రమేష్ బాబు, తహసీల్దారు శిరీష తదితరులు పాల్గొన్నారు.

పుత్తూరు వార్తలు

ఘనంగా రాజ్యాంగ దినోత్సవం



ప్రసంగిస్తున్న సీనియర్ సివిల్ జడ్జి రాఘవేంద్ర

పుత్తూరు, నవంబరు 26(ఆంధ్రజ్యోతి): భారత రాజ్యాంగ దినోత్సవాన్ని స్థానిక కెకెసీ లా కళాశాల, ప్రభుత్వ పాలిటెక్నిక్, ప్రభుత్వ డిగ్రీ కళాశాలల్లో బుధవారం ఘనంగా నిర్వహించారు. ఈసందర్భంగా కెకెసీ కళాశాలలో జరిగిన సమావేశంలో సీనియర్ సివిల్ జడ్జి రాఘవేంద్ర మాట్లాడుతూ అత్యున్నతమైన రాజ్యాంగాన్ని పౌరులందరూ గౌరవించాలని కోరారు. ప్రిన్సిపాల్ రాజేంద్ర ప్రసాద్, చైర్మన్ కుప్పయ్యశెట్టి, వైస్‌చైర్మన్ నరసింహారావు, అధ్యాపకులు పాల్గొన్నారు. పాలిటెక్నిక్‌లో జరిగిన సమావేశంలో కెకెసి కళాశాల ప్రిన్సిపాల్ రాజేంద్రప్రసాద్ మాట్లాడుతూ రాజ్యాంగం భారత ప్రజాస్వామ్యానికి బలమైన పునాదని అన్నారు. ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో పొలిటికల్ సైన్సు, ఎకనామిక్స్, వే ఫౌండేషన్ సంస్థ ఆధ్వర్యంలో రాజ్యాంగ దినోత్సవాలు ఘనంగా జరిగాయి.

పుత్తూరు టౌన్ (ఆంధ్రజ్యోతి): దేశ రాజ్యాంగాలల్లో భారత రాజ్యాంగం గొప్పదని అంబేడ్కర్ ట్రస్ట్ చైర్మన్, ఎమ్మెల్యే ఆదిమూలం పేర్కొన్నారు. అంబేడ్కర్ సర్కిల్ వద్ద ఉన్న అంబేడ్కర్ విగ్రహానికి పూల మాలలు వేసి నివాళులర్పించారు. అంబేడ్కర్ ట్రస్ట్ కార్యదర్శి కుప్పయ్య, సభ్యులు అప రంజి, మావిలయ్య, సీపీఐ నాయకులు మహేష్ తదితరులు పాల్గొన్నారు.

సమస్యల పరిష్కారానికి ధర్నా



డిపో గ్యారేజి ముందు ధర్నాలో ఆర్టీసీ కార్మికులు

పుత్తూరు, నవంబరు 26(ఆంధ్రజ్యోతి): అపరిష్కృత సమస్యల పరిష్కారం కోసం స్థానిక ఆర్టీసీ గ్యారేజీ ముందు బుధవారం మజ్దూర్ యూనియన్ కార్మికులు ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా యూనియన్ కార్యదర్శి శివకుమార్ మాట్లాడుతూ అక్రమ సస్పెన్షన్లను రద్దు చేయాలని, శిథిలావస్థకు చేరుకున్న గ్యారేజీకి మరమ్మతులు చేపట్టాలని, కండక్టర్లకు, డ్రైవర్లకు నూతన చార్టులను వేయాలని డిమాండ్ చేశారు.

అనధికార కంటి ఆస్పత్రి సీజ్

పుత్తూరు, నవంబరు 26(ఆంధ్రజ్యోతి): పట్టణంలోని ఎంబీ రోడ్డులో అనధికారంగా, నిబంధనలకు విరుద్ధంగా నిర్వహిస్తున్న చెన్నై శరవణ కంటి ఆస్పత్రిని బుధవారం ప్రభుత్వ అధికారులు సీజ్ చేశారు. ఈ కార్యక్రమంలో స్థానిక వైద్యాధికారి రమేష్, సీహెచ్‌వో శివయ్య, శోభన్‌బాబు, వీఆర్వో బాబు తదితరులు పాల్గొన్నారు.

మహిళలకు స్వయం ఉపాధిపై శిక్షణ

పుత్తూరు టౌన్,నవంబర్ 26(ఆంధ్రజ్యోతి): పట్టణంలో రాస్ ఆధ్వర్యంలో మహిళలకు స్వయం ఉపాధి అవకాశాలపై ఆపిల్ కంప్యూటర్స్‌లో ఉచిత కంప్యూటర్ శిక్షణ తరగతులను జన్ శిక్షణ్ సంస్థాన్ ఆధ్వర్యంలో ప్రారంభించారు. ఈ సందర్భంగా ప్రోగ్రాం అధికారి హరిబాబు మాట్లాడుతూ... టైలరింగ్, ఆర్య వర్క్, బ్యూటీషియన్ కోర్సులను కూడా ఉచితంగా అందిస్తున్నట్టు తెలిపారు.

భక్తిశ్రద్ధలతో లక్ష బిల్వార్చన

పుత్తూరు టౌన్, నవంబర్ 26(ఆంధ్రజ్యోతి): పట్టణంలోని కేఎన్ రోడ్డులో ఉన్న కామాక్షి సమేత సదాశివేశ్వర ఆలయంలో ప్రాంగణంలో కొలువై ఉన్న అయ్యప్ప స్వామి ఆలయంలో 49వ లఘు లక్ష బిల్వార్చన శాస్త్రోక్తంగా నిర్వహించారు. ఉదయం 4.30 గంటల నుంచి గణపతి పూజ, లక్ష్మీ గణపతి హోమం 5.30 గంటలకు అయ్యప్ప స్వామికి పాలాభిషేకం, 6.30 గంటలకు మహాభిషేకం, 9 గంటలకు కలశస్థాపన అనంతరం లక్షా బిల్వార్చన ప్రారంభించారు. మధ్యాహ్నం అన్నదానం చేశారు. సాయంత్రం జ్యోతి పూజను అత్యంత వైభవంగా నిర్వహించారు.

జీవ ఎరువులను వినియోగించండి

పుత్తూరు టౌన్, నవంబర్ 26(ఆంధ్రజ్యోతి): రసాయనిక ఎరువులకు ప్రత్యామ్నాయం జీవన ఎరువులేనని తిరుపతి వ్యవసాయ పరిశోధన సహాయ సంచాలకులు సుమతి పేర్కొన్నారు. బుధవారం పుత్తూరు మండలంలోని నందిమంగళంలో ఎరువుల వినియోగంపై రైతులకు సలహాలు, సూచనలు ఇచ్చారు. ఈ కార్యక్రమంలో చిత్తూరు ప్రిన్సిపల్ సైంటిస్ట్, కోఆర్డినేటర్ రామకృష్ణారావు, ఆర్ఏఆర్ఎస్ శాస్త్రవేత్తలు, ఏడీ శ్రీలక్ష్మి, ఏవో కోదండయ్య, వ్యవసాయ సహాయకులు మురళి, తరుణ్, చంద్రయ్య తదితరులు పాల్గొన్నారు.

సహకార సంఘ సేవలను సద్వినియోగం చేసుకోండి

పుత్తూరు టౌన్, నవంబర్ 26(ఆంధ్రజ్యోతి): సహకార సంఘ సేవలను సద్వినియోగం చేసుకోవాలని పీఆర్ మంగళం సహకార సంఘ అధ్యక్షుడు మోహన్‌రాజు తెలిపారు. బుధవారం సంఘ సమావేశంలో ఆయన మాట్లాడుతూ సహకార సంఘాల ద్వారా రైతులకు రుణాలు అందజేయడమే కాక, రాయితీపై ఎరువులు, విత్తనాలు, క్రిమిసంహారక మందులు, వ్యవసాయ యంత్ర పరికరాలు అందజేస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో డీసీసీబీ మేనేజర్ కీర్తన, సూపర్‌వైజర్ ఢిల్లీబాబు, సంఘ డైరెక్టర్లు, సింగిల్ విండో ఇన్‌చార్జి సీఈవో ఆర్.చెన్న, సంఘ సభ్యులు పాల్గొన్నారు.

బ్రాహ్మణ జాతిపై విషం చిమ్మే వారిని అరెస్టు చేయాలి

పుత్తూరు అర్బన్, నవంబర్ 26(ఆంధ్రజ్యోతి): బ్రాహ్మణ జాతిపై విషంచిమ్ముతూ అనుచిత వ్యాఖ్యలతో అవమాన పరిచే విధంగా మాట్లాడే వారిని అరెస్టు చేయాలని రాష్ట్ర బ్రాహ్మణ సంక్షేమ సమాఖ్య రాష్ట్ర సంయుక్త కార్యదర్శి రెడ్డి ప్రకాష్, జిల్లా సంయుక్త కార్యదర్శి బాలాజీ డిమాండ్ చేశారు. పల్లవోలు రమణ అలియాస్ జేడీ సారయ్య, వారి బృందాన్ని అరెస్టు చేసి కఠినంగా శిక్షించాలని కోరారు.

వైభవంగా అయ్యప్ప ఊరేగింపు



వడమాలపేట, నవంబరు 26(ఆంధ్రజ్యోతి): మండలంలోని పాదిరేడులో బుధవారం అయ్యప్ప స్వామి ఊరేగింపు వైభవంగా జరిగింది. రాత్రి భజనలతో పడికట్ల పూజ చేశారు. అనంతరం అయ్యప్ప స్వామిని ఆభరణాలు, పూలమాలలతో అలంకరించి మేళతాళాలు, అయ్యప్ప శరణులతో గ్రామంలో ఊరేగించారు.

వడమాలపేట మండలాన్ని అభివృద్ధి చేయండి



ఎంపీపీ కుటుంబీకులతో ఎమ్మెల్యే

వడమాలపేట, నవంబరు 26 (ఆంధ్రజ్యోతి): మండలాన్ని అన్ని రంగాల్లో అభివృద్ధి చేయాలని ఎమ్మెల్యే గాలి భానుప్రకాష్ చెప్పారు. బుధవారం తిరుపతిలోని ఆయన నివాసంలో ఎంపీపీ విజయలక్ష్మి కుటుంబ సభ్యులతో ఎమ్మెల్యేను సన్మానించారు. ఇటీవల వైసీపీ సానుభూతిపరులైన ఎంపీటీసీ సభ్యులు ప్రతిపాదించిన అవిశ్వాస తీర్మానం వీగిపోయి ఎంపీపీగా విజయలక్ష్మి కొనసాగుతున్నారు. ఈనేపథ్యంలో మర్యాదపూర్వకంగా ఎమ్మెల్యే భానుప్రకాష్‌ను కలిశారు. జడ్పీటీసీ సభ్యుడు మురళీధర్ రెడ్డి, నందయ్య, చైతన్య, లంబు తదితరులు ఉన్నారు.

గూడూరు

సూళ్లూరుపేట/వెంకటగిరి

నేడు విద్యుత్ సరఫరాలో అంతరాయం

సూళ్లూరుపేట, నవంబరు 26 (ఆంధ్రజ్యోతి): మండల పరిధిలోని మన్నెముత్తేరి 33/11 కేవీ సబ్‌స్టేషన్ పరిధిలో నూతనంగా ఏర్పాటు చేస్తున్న ట్రాన్స్‌ఫార్మర్ మలి విడత పనుల కారణంగా గురువారం ఉదయం 10 గంటల నుంచి మధ్యాహ్నం 1 గంట వరకు విద్యుత్ సరఫరా నిలిపివేయనున్నట్లు ఏడీఈ శేఖర్ తెలిపారు. సబ్‌స్టేషన్ పరిధిలోని ఇసుకమిట్ట, వన్నెముత్తేరి, బాహూజీ కాలనీ, దేగలపాలెం గ్రామాల్లో విద్యుత్ సరఫరా ఉండదని వినియోగదారులు, రైతులు సహకరించాలని కోరారు.

రైల్వేగేటు మూసివేత

సూళ్లూరుపేట, నవంబరు 26 (ఆంధ్రజ్యోతి): సూళ్లూరుపేట పట్టణంలోని కచ్చేరివీధిలో ఉన్న ప్రధాన రైల్వే గేటును ఎల్‌సీ-60 మరమ్మతుల కారణంగా గురువారం మధ్యాహ్నం 2 గంటల నుంచి శుక్రవారం రాత్రి 11 గంటల వరకు మూసివేయనున్నట్లు రైల్వే అధికారులు తెలిపారు.

రేపు ప్రజాదర్బార్

కోట, నవంబరు 26 (ఆంధ్రజ్యోతి): కోట మండల పరిషత్ కార్యాలయంలో ఈనెల 28వ తేదీ ఉదయం 10 గంటలకు ప్రజాదర్బార్ నిర్వహిస్తున్నట్లు ఎంపీడీవో దిలీప్‌కుమార్‌నాయక్ తెలిపారు. ఎమ్మెల్యే పాశిం సునీల్‌కుమార్ విచ్చేసి ప్రజల నుంచి అర్జీలను స్వీకరిస్తారని, ఈ అవకాశాన్ని ప్రజలు సద్వినియోగం చేసుకోవాలన్నారు.

బైక్‌ను ఢీకొన్న టిప్పర్: మహిళకు గాయాలు

కోట, నవంబరు 26 (ఆంధ్రజ్యోతి): మండల పరిధిలోని విద్యానగర్ కొత్తపాళెం రోడ్డు వద్ద బుధవారం బైక్‌ను టిప్పర్ ఢీకొన్న సంఘటనలో సుజన అనే మహిళ గాయపడింది. చిల్లకూరు మండలం తల్లమాలకు చెందిన సుజన కుమారుడితో కలిసి బైక్‌లో విద్యానగర్ సెంటర్‌కు వెళ్తుండగా వెనుక నుంచి టిప్పర్ ఢీకొంది. ఈ ప్రమాదంలో సుజనకు గాయాలవడంతో కోట ఆస్పత్రికి తరలించారు.





మంగళంపాడు చెరువులో నిర్మాణంలో ఉన్న ఎస్ఎస్ ట్యాంకు - చెరువును ఆనుకుని చెత్త వేసిన దృశ్యం

ఎస్ఎస్ ట్యాంకు పక్కన డంపింగ్ యార్డు?

మంగళంపాడు చెరువు సమీపంలో స్థల పరిశీలన ● వ్యతిరేకిస్తున్న గ్రామస్తులు

సూళ్లూరుపేట, నవంబరు 26 (ఆంధ్రజ్యోతి): సూళ్లూరుపేట మున్సిపాలిటీ డంపింగ్ యార్డు కోసం అధికారులు తాజాగా పరిశీలించిన స్థలం వివాదాస్పదమవుతోంది. సూళ్లూరుపేట పట్టణానికి తాగునీరందించేందుకు రూ.169 కోట్లు ఏఐఐబీ నిధులతో మంగళంపాడు చెరువులో సమ్మర్ స్టోరేజ్ ట్యాంకు నిర్మించాలని గత టీడీపీ ప్రభుత్వం నిర్ణయించింది. ఇందుకోసం మంగళంపాడు చెరువు పక్కనే ఉన్న సర్వే నెంబరు 2లో 90 ఎకరాలు, సర్వే నెంబరు 3లో 70 ఎకరాలు(మొత్తం160) ఎస్ఎస్ ట్యాంకు నిర్మాణానికి పంచాయతీ తీర్మానం ద్వారా అప్పగించారు. పనులు కూడా 60 శాతం పైగా జరిగాయి. గత వైసీపీ ప్రభుత్వ హయాంలో బిల్లుల చెల్లింపులో జాప్యం జరగడంతో పనులు ఆగిపోయాయి. కూటమి ప్రభుత్వం కొలువు దీరాక మళ్లీ యూడీఎఫ్ నిధులు కేటాయించి టెండర్ల ప్రక్రియ కూడా పూర్తి చేసింది. త్వరలోనే పనులు ప్రారంభించి మార్చి నాటికి తాగునీరందించేందుకు ప్రణాళికలు రూపొందించారు. ఇదిలా ఉండగా సమ్మర్ స్టోరేజ్ నిర్మాణం జరుగుతున్న చెరువును ఆనుకొనే డంపింగ్ యార్డు ఏర్పాటుకు అధికారులు గుట్టుచప్పుడు స్థల పరిశీలన చేయడం వివాదాస్పదమవుతోంది. పట్టణంలో రోజుకు 23 మెట్రిక్ టన్నుల చెత్త ఉత్పత్తి అవుతోంది. ప్రస్తుతం జాతీయ రహదారి ఆనుకుని కాళంగి నది ఒడ్డున ఉన్న డంపింగ్ యార్డును పట్టణానికి దూరంగా ఏర్పాటు చేసేందుకు అధికారులు ప్రయత్నాలు చేపట్టారు. పలుచోట్ల స్థలాలను పరిశీలించి మూడు నెలల క్రితం కొణ్ణంబట్టు వద్ద పది ఎకరాలు భూమిని కేటాయించారు. సమీప గ్రామస్తుల నుంచి వ్యతిరేకత రావడంతో సమస్య మొదటికొచ్చింది. చివరికి ఎస్ఎస్ ట్యాంక్ పక్కన డంపింగ్ యార్డు ఏర్పాటు చేసేందుకు అధికారులు గుట్టుచప్పుడు కాకుండా స్థల పరిశీలన చేశారు. ఈ విషయం గ్రామస్తులకు తెలియడంతో ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. మున్సిపాలిటీ తాగునీటి పథకానికి సమీపంలో డంపింగ్ యార్డు ఏర్పాటు చేయడం ఏంటని, పంచాయతీలో తీర్మానం లేకుండా, గ్రామస్తులకు సమాచారం ఇవ్వకుండా ఎలా నిర్ణయం తీసుకుంటారంటూ తహసీల్దార్ గోపినాథరెడ్డిని ప్రశ్నించారు. ఈ విషయం ప్రజారోగ్యశాఖ అధికారులకు తెలియడంతో సమ్మర్ స్టోరేజ్ ఉన్న ప్రదేశానికి 600 మీటర్ల దూరం వరకు డంపింగ్ యార్డు ఏర్పాటు చేయకూడదని స్పష్టం చేసినట్లు సమాచారం.

రాజ్యాంగంతో అందరికీ సమన్యాయం



అంబేడ్కర్ చిత్రపటానికి నివాళులర్పిస్తున్న జడ్జి వెంకట నాగపవన్ కుమార్, న్యాయవాదులు

గూడూరు, నవంబరు 26 (ఆంధ్రజ్యోతి): దేశంలో అందరికీ సమన్యాయం చేకూరాలనే ఉద్దేశంతో డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ రాజ్యాంగాన్ని అందించారని ఏడవ అదనపు జిల్లా జడ్జి వెంకట నాగపవన్‌కుమార్ అన్నారు. బుధవారం స్థానిక కోర్టు ఆవరణలో మండల న్యాయసేవాధికార సంస్థ ఆధ్వర్యంలో జాతీయ రాజ్యాంగ దినోత్సవం, వరకట్న వ్యతిరేక దినం నిర్వహించారు. ముందుగా అంబేడ్కర్ చిత్రపటానికి నివాళులర్పించారు. కార్యక్రమంలో న్యాయమూర్తి సులోచనా రాణి, న్యాయవాదులు కొత్తపల్లి వసంతకుమార్, అరవ పార్వతయ్య, మెహబూబ్ బాషా తదితరులు పాల్గొన్నారు.

తడ: స్థానిక జడ్పీ బాలికల ఉన్నత పాఠశాలలో జనవిజ్ఞానవేదిక ఆధ్వర్యంలో రాజ్యాంగ దినోత్సవం జరిగింది. విద్యార్థుల చేత మాక్ పార్లమెంట్‌ను నిర్వహించారు. అనంతరం వ్యాసరచన, వక్తృత్వ, చిత్రలేఖనం పోటీలను నిర్వహించి గెలుపొందిన విద్యార్థులకు బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో ఎంఈవోలు వేములు, మల్లికార్జనరావు, న్యాయవాది శ్రీనివాసులు, జనవిజ్ఞాన వేదిక నాయకులు చెంగయ్య, రామమూర్తి, ప్రధానోపాధ్యాయుడు సురేష్‌బాబు, తదితరులు పాల్గొన్నారు. అలాగే స్థానిక ఎంపీడీవో కార్యాలయంలో అంబేడ్కర్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఎంపీపీ కొలవి రఘురెడ్డి, ఎంపీడీవో శేఖర్‌నాయక్, తదితరులు పాల్గొన్నారు.

నాయుడుపేట: పట్టణంలోని జనసేన కార్యాలయంలో నియోజవర్గ ఇన్‌చార్జి, ఏఎంసీ చైర్మన్ ఉయ్యాల ప్రవీణ్ ఆధ్వర్యంలో రాజ్యాంగ దినోత్సవం నిర్వహించారు. అంబేడ్కర్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో జనసేన నాయకులు అట్ల కృష్ణారావు, గిండి సతీష్, బాలు, శ్రీను, ఉపేంద్ర, మహేంద్ర, రోహిణి, నల్మ, వైష్ణవి తదితరులు పాల్గొన్నారు.

సూళ్లూరుపేట: వ్యవసాయ మార్కెట్ కమిటీ కార్యాలయంలో చైర్మన్ ఆకుతోట రమేష్ ఆధ్వర్యంలో రాజ్యాంగ దినోత్సవం నిర్వహించారు. అంబేడ్కర్ చిత్రపటానికి నివాళులర్పించారు. కార్యక్రమంలో ఏఎంసీ ఉపాధ్యక్షుడు రవీంద్రారెడ్డి, కార్యదర్శి రామమ్మ, డైరెక్టర్లు పాల్గొన్నారు.

ఓజిలి: స్థానిక స్త్రీశక్తి భవనంలో రాజ్యాంగ దినోత్సవం నిర్వహించారు. అంబేడ్కర్ చిత్రపటానికి ఎంపీడీవో నారాయణ రెడ్డి, తహసీల్దార్ పద్మావతి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో ఏపీఎం పద్మ, సీసీలు సిబ్బంది పాల్గొన్నారు.

వెంకటగిరి టౌన్: పట్టణంలోని బంగారుపేట, మోడల్ స్కూల్, జడ్పీ ఉన్నత పాఠశాలల్లో రాజ్యంగ దినోత్సవ వేడుకలు నిర్వహించారు. అంబేడ్కర్ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. విద్యార్థులకు మాక్ పార్లమెంట్, క్విజ్, వ్యాసరచన, చిత్రలేఖనం పోటీలు నిర్వహించి బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో మోడల్ స్కూల్ ప్రిన్సిపాల్ తులసిజ్యోతి, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

చిల్లకూరు: స్థానిక రెవెన్యూ కార్యాలయంలో తహసీల్దారు శ్రీనివాసులు ఆధ్వర్యంలో రాజ్యాంగ దినోత్సవం నిర్వహించారు. అంబేడ్కర్ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు.

చిట్టమూరు: మండల పరిషత్ కార్యాలయంలో ఎంపీడీవో ఉమామహేశ్వరరావు ఆధ్వర్యంలో రాజ్యాంగ దినోత్సవం నిర్వహించారు. అంబేడ్కర్ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు.

కోట: తహసీల్దారు, మండల పరిషత్, ఎంఈవో కార్యాలయాల్లో రాజ్యాంగ దినోత్సవ వేడుకలు జరిగాయి. తహసీల్దారు జయజయరావు, ఎంపీడీవో దిలీప్‌కుమార్ నాయక్, ఎంఈవో మస్తానయ్య తదితరులు అంబేడ్కర్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు.

వేడుకగా రాజ్యాంగ దినోత్సవం

వరదయ్యపాళెం, నవంబరు 26(ఆంధ్రజ్యోతి): పట్టణంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ఇన్‌చార్జి ప్రధానోపాధ్యాయుడు దుష్యంత్ రెడ్డి అధ్యతన సాంఘిక శాస్త్ర ఉపాధ్యాయులు చినబాబు, దేవిరాజీ ఆధ్వర్యంలో రాజ్యాంగ దినోత్సవం సందర్భంగా మాక్ పార్లమెంట్ నిర్వహించారు. మండలంలోని కంచరపాళెంలో రాజ్యాంగ దినోత్సవం సందర్భంగా అంబేడ్కర్ విగ్రహానికి ఎమ్మెల్యే ఆదిమూలం నివాళులర్పించారు. యతిరాజు, జయశంకర్ రెడ్డి, మురళీనాయుడు, మైక్ నంద తదితరులు పాల్గొన్నారు. కంచరపాళెంలో అంబేడ్కర్ విగ్రహానికి ఎంపీ గురుమూర్తి, మాజీ మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి, మాజీ ఎమ్మెల్యేయ భూమన కరుణాకర రెడ్డి ఆధ్వర్యంలో అంబేడ్కర్ విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. రాజేష్, రాకేష్, సుజన, సురేష్, దయాకర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

వెట్టి చాకిరి నుంచి ముగ్గురు పిల్లలకు విముక్తి

రేణిగుంట నవంబర్ 26 (ఆంధ్రజ్యోతి): వెట్టి చాకిరి నుంచి ముగ్గురు పిల్లలకు విముక్తి కలిగింది. బుధవారం మండలానికి చెందిన ముగ్గురు పిల్లలను బాతుల పెంపకం పేరుతో పిల్లల తల్లి దండ్రులతో ప్రాంసరీ బాండ్లు రాయించుకున్నారని తెలియడంతో తహసీల్దార్ చంద్రశేఖర్ రెడ్డి సంబంధిత అధికారుల సమక్షంలో వారిని విముక్తి కలిగించారు. వారిని గురుకుల పాఠశాలలో చేర్పించారు.చాకిరి చేయించిన వ్యక్తిని పోలీసులు అదుపులోకి తీసుకున్నారు.

అమరరాజా క్వార్టర్స్‌లో చోరీ

అంతర్రాష్ట్ర దొంగల పనిగా పోలీసుల అనుమానం

రేణిగుంట నవంబర్ 26 (ఆంధ్రజ్యోతి): మండంలోని కరకంబాడి సమపీంలో అమరరాజా ఫ్యాక్టరీ ఉద్యోగుల క్వార్టర్స్‌లో జరిగిన చోరీ అంతర్రాష్ట్ర దొంగల పనే అని పోలీసులు అనుమానిస్తున్నారు. మూడు రోజుల క్రితం క్వార్టర్స్‌లో చోరీ జరిగిన విషయం విదితమే. ఈక్రమంలో చోరీని ఛేదించేందుకు పోలీసులు మూడు బృందాలుగా విడిపోయి గాలింపు ముమ్మరం చేశారు. మరోపక్క చోరీ జరిగిన ప్రదేశాన్ని జిల్లా ఎస్పీ సుబ్బరాయుడు, అడిషనల్ ఎస్పీ రవి మనోహరాచారితో కలిసి బుధవారం పరిశీలించారు. చోరీ జరిగిన సమీప ప్రాంతాల్లో ఉన్న సీసీ కెమెరాల్లో ఎక్కడ చిక్కకుండా దొంగలు జాగ్రత్త పడడంతో , సాంకేతిక ఆధారాలతో మరింత లోతుగా విచారణ చేపడుతున్నట్లు పోలీసులు తెలిపారు.

పది ఎర్రచందన దుంగల స్వాధీనం



రేణిగుంట, నవంబరు 26 (ఆంధ్రజ్యోతి): మండల పరిధి లోని మామండూరు అటవీ ప్రాంతంలో అటవీశాఖ అధికారులు 10 ఎర్రచందన దుంగలు స్వాధీనం చేసుకున్నారు. బుధవారం సాయంత్రం మామండూరు అటవీ ప్రాంతంలోని మాటుమందుల ప్రాంతంలో కూంబింగ్ నిర్వహిస్తుండగా చెట్లు నరుకుతున్న శబ్దం రావడంతో ఆ ప్రాంతాన్ని పరిశీలించేందుకు వెళ్లారు. సిబ్బంది రాక గమనించిన స్మగ్లర్లు పారిపోయారు. దీంతో అదే ప్రాంతంలో 207 కిలోల బరువున్న 10 ఎర్రచందన దుంగలను స్వాధీనం చేసుకున్నారు. ఈ కూంబింగ్ లో ఎఫ్ఆర్వో సుదర్శన్ రెడ్డి, డిప్యూటీ ఆర్ఐ గౌస్, సెక్షన్ సిబ్బంది శ్రావణ కుమార్, దక్షిణ బేస్ క్యాంపు సిబ్బంది పాల్గొన్నారు.

లేబర్ కోడ్లను రద్దు చేయాలి

గూడూరు, నవంబరు 26 (ఆంధ్రజ్యోతి): కార్మిక వర్గాన్ని బానిసలుగా మార్చే నాలుగు లేబర్ కోడ్లను వెంటనే రద్దు చేయాలని వామపక్ష నాయకులు డిమాండ్ చేశారు. బుధవారం స్థానిక టవర్‌క్లాక్ సెంటర్ వద్ద సీఐటీయూ, ఏఐటీయూసీ ఆధ్వర్యంలో నిరసన తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కార్పొరేట్ ప్రయోజనాల కోసం కేంద్రం ఈ లేబర్‌కోడ్లను తీసుకువచ్చిందని విమర్శించారు. కార్యక్రమంలో శివకుమార్, ప్రభా కర్, బీవీరమణయ్య, శశికుమార్, మణి, నారాయణ, రమేష్, సునీల్, ప్రసాద్, చంద్రయ్య, శివకుమార్, నాగరాజు పాల్గొన్నారు.

మధ్యాహ్న భోజనం తనిఖీ

వెంకటగిరి టౌన్, నవంబరు 26(ఆంధ్రజ్యోతి): పట్టణంలోని బంగారుపేట పాఠశాలలో మధ్యాహ్నం భోజనాన్ని ఎంఈవో-2 బాబయ్య బుధవారం తనిఖీ చేశారు. మెనూ ప్రకారం నాణ్యతతో కూడిన భోజనం అందించాలని సూచించారు.

వైభవంగా సుబ్రహ్మణ్యస్వామి కల్యాణం



కల్యాణం నిర్వహిస్తున్న వేదపండితులు

సూళ్లూరుపేట, నవంబరు 26 (ఆంధ్రజ్యోతి): సుబ్రహ్మణ్య షష్ఠి సంద ర్భంగా గంగా పార్వతీ సమేత నాగేశ్వరస్వామి ఆలయంలో బుధవారం శ్రీవల్లీ, దేవసేన సమేత సుబ్రహ్మణ్యస్వామి కల్యాణాన్ని వైభవంగా నిర్వహిం చారు. ఆలయ ప్రాంగణంలో కల్యాణ వేదిక ఏర్పాటు చేసి స్వామి, అమ్మవారి ఉత్సవ మూర్తులను కొలువుదీర్చి ఆలయ ప్రధాన అర్చకులు సునీల్ కుమార్ శర్మ ఆధ్వర్యంలో వేదపండితుల మంత్రోచ్ఛరణ నడుమ కల్యాణాన్ని నిర్వ హించారు. భక్తులు అధిక సంఖ్యలో విచ్చేసి కల్యాణాన్ని తిలకించారు. పర్వతరెడ్డి ప్రభాకర్‌రెడ్డి, కవిత దంపతులు ఉభయదాతలుగా వ్యవహరిం చారు. పాలకమండలి అధ్యక్షుడు ఆదినారాయణరెడ్డి, సభ్యులు పాల్గొన్నారు.

నిజాయితీ చాటుకున్న ఆటో డ్రైవర్



బంగారు ఆభరణాన్ని బాధితురాలికి అందజేస్తున్న ఆటో డ్రైవర్ శ్రీనివాసులు

గూడూరు అర్బన్, నవంబరు 26 (ఆంధ్రజ్యోతి): ఓ మహిళ ఆటోలో మరిచిపోయిన బంగారు ఆభరణాన్ని తిరిగి అందజేసి ఓ ఆటో డ్రైవర్ నిజాయితీని చాటుకున్నాడు. చిల్లకూరు మండలం చింతవరం గ్రామానికి చెందిన సుబ్బమ్మ గూడూరుకు వచ్చేందుకు ఆటో ఎక్కింది. అయితే ఆ ఆటో బయలుదేరడం ఆలస్యం కావ డంతో మరో ఆటో ఎక్కే క్రమంలో తన సంచిని మరిచిపోయింది. అందులో బంగారు ఆభరణం ఉండడంతో శ్రీనివాసులు గూడూరు మార్కెట్ సమీ పంలోని ఆటో స్టాండు వద్దకు వచ్చి అక్కడి డ్రైవర్లు అంకయ్య, పెంచలయ్య సాయంతో బాధితురాలు సుబ్బమ్మను గుర్తించి ఆమెకు బంగారు ఆభరణం ఉన్న సంచిని అందజేశాడు.

రైతు సంక్షేమమే ప్రభుత్వ ధ్యేయం: విజయశ్రీ



రైతులకు కరపత్రాలను అందజేస్తున్న ఎమ్మెల్యే విజయశ్రీ

నాయుడుపేట టౌన్, నవంబరు 26 (ఆంధ్రజ్యోతి): రైతు సంక్షేమమే ధ్యేయంగా ప్రభుత్వం అడుగులు వేస్తున్నదని సూళ్లూరుపేట ఎమ్మెల్యే డాక్టర్ నెలవల విజయశ్రీ అన్నారు. మండలంలోని కూచివాడ గ్రామంలో బుధవారం రాత్రి రైతన్నా సేవలో మన మంచి ప్రభుత్వం కార్యక్రమాన్ని టీడీపీ మండల అధ్యక్షుడు సన్నారెడ్డి చంద్రశేఖర్‌రెడ్డి ఆధ్వర్యంలో నిర్వహించారు. ఎమ్మెల్యే ప్రతి ఇంటికీ వెళ్లి కరపత్రాలను అందజేశారు. రైతులతో మాట్లాడి వారి సమస్యలను తెలుసుకున్నారు. కూచివాడ గ్రామంలో అన్నదాత సుఖీభవ పథకం కింద 240 మంది రైతుల ఖాతాలో రూ.24 లక్షలు జమ అయినట్లు తెలిపారు. ఇప్పటికే నియోజకవర్గంలో రెండో కోటా కింద యూరియా అందజేసినట్లు చెప్పారు. కార్యక్రమంలో వ్యవసాయశాఖ ఏడీ నాగార్జునసాగర్, వెటర్నరీ ఏడీ గోవర్ధన్‌రెడ్డి, ఏవో గణేష్, మాజీ జడ్పీటీసీ శ్రీరాంప్రసాద్, నాయకులు కరుణాకర్‌రెడ్డి, రత్నయ్య, కట్టా వెంకటరమణారెడ్డి, యేసుదాసు, రైతులు పాల్గొన్నారు.

రైతుల అభ్యున్నతికి పంచసూత్రాలు: కురుగొండ్ల



సభలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే కురుగొండ్ల రామకృష్ణ

డక్కిలి, నవంబర్ 26(ఆంధ్రజ్యోతి): రానున్న ఐదేళ్లలో రైతులు అభ్యున్నతి సాధించేలా ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు పంచసూత్రాలు అమలు చేస్తున్నరని ఎమ్మెల్యే కురుగొండ్ల రామకృష్ణ అన్నారు. బుధవారం డక్కిలి మండలం తీర్థంపాడు గ్రామంలో నిర్వహించిన రైతన్నా మీసేవలో... మన మంచి ప్రభుత్వం' కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. రైతుల సంక్షేమం కోసం ప్రభుత్వం అనేక సంక్షేమ పథకాలు అమలు చేస్తోందన్నారు. వెంకటగిరి నియోజకవర్గంలో వరి సాగు అధికంగా ఉండటంతో యూరియా సరఫరా విషయంలో ప్రభుత్వాన్ని అప్రమత్తం చేసినట్లు వెల్లడించారు. ధాన్యం విక్రయించిన 48 గంటల్లో రైతుల ఖాతాలో నగదు జమ చేస్తున్న ఘనత టీడీపీ ప్రభుత్వానిదేనన్నారు. ఎన్నికల హామీ మేరకు అన్నదాత సుఖీభవ కింద ఏడాదికి రూ.20వేలు చొప్పున రైతులకు ఆర్థిక సాయం అందిస్తున్నామని చెప్పారు. రైతులు ముందుకు వస్తే ఎంఎస్ఎంఈ కింద పరిశ్రమలు స్థాపించేందుకు ప్రభుత్వం సాయం అందిస్తామన్నారు. కార్యక్రమంలో వ్యవసాయ శాఖ జేడీ ప్రసాద్‌రావు, ఏవో శిరీషా, ఎంపీడీవో రవీంద్రబాబు, నాయకులు పోలంరెడ్డి కోటేశ్వరరెడ్డి, ఏలేశ్వరం రామచంద్ర నాయుడు, అయ్యప్పరెడ్డి, రాజా తదితరులు పాల్గొన్నారు.







శ్రీకాళహస్తి మండలంలోని వెల్లంపాడు సమీపంలో ఉన్న సుధా సోమానీ టైల్స్ కర్మాగారంలో ట్యాంకర్ పేలిన ఘటనలో ఇద్దరు మృతి చెందగా మరో ఇద్దరు గాయపడ్డారు. చంద్రగిరికి చెందిన బాలాజీ, ఒడిశాకు చెందిన సౌభాగ్య నాయక్ అలియాస్ రంజన్‌నాయక్ తీవ్రంగా గాయపడ్డారు. వీరిని వెంకటగిరి ప్రభుత్వ ఏరియా ఆస్పత్రికి తరలించారు. మృతదేహాలను డీఎస్పీ నరసింహమూర్తి పరిశీలించారు.

- శ్రీకాళహస్తి, ఆంధ్రజ్యోతి

మూలకు చేరిన వందేళ్ల నాటి నాగశిల



పళ్లికొండేశ్వర ఆలయ ఆవరణలో మూలన పడిన నాగాలమ్మ విగ్రహాలు

నాగలాపురం, నవంబరు 26(ఆంధ్రజ్యోతి): దాదాపు వందేళ్లకు మునుపటి నుంచి నిత్యం పూజలందుకున్న నాగాలమ్మ గత కొన్నేళ్లుగా మూలన చేరింది. మండలంలోని సురుటుపల్లి పళ్లికొండేశ్వర ఆలయ ఆవరణ ఎదుట వందేళ్ల నుంచి వేపచెట్టు ఉండేది. ఆ చెట్టు తిన్నెపై నాగశిల(నాగాలమ్మ) ఉండేది. 1996లో అప్పటి టీడీపీ ప్రభుత్వంలో ఆలయ చైర్మన్ వెంకట రామరాజు హయాంలో ఆ శిల పక్కనే మరో రెండు శిలలను ప్రతిష్ఠించారు. అప్పట్లో ఈ ఆలయానికి వచ్చే భక్తులు ఈ నాగ శిలలకు పూజలు చేసి ఆలయంలోకి ప్రవేశించే వారు. తరువాత వెంకటరామరాజు ఆధ్వర్యంలో ఆ శిలలను ఆలయం లోపల రావి చెట్టు కింద ప్రతిష్ఠింపజేశారు. ఈ క్రమంలో ఆలయ అభివృద్ధి పనుల్లో భాగంగా 2004లో చైర్మన్ అపరంజి రాజు ఆ శిలలను తొలగించి మూలన పడేశారు. పవిత్రంగా పూజలందుకున్న ఈ నాగాలమ్మ శిలలు ప్రస్తుతం మూలన పడి ఉండడంపై మహిళా భక్తులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. దూరంగా పడేసిన శిలలకు పూజలు చేస్తున్నారు. నాగాలమ్మ శిలలను ఆలయ ఆవరణలోనే పునః ప్రతిష్ఠించాలని స్థానికులు కోరుతున్నారు.

ప్రతి ఒక్కరికీ సమన్యాయం



సమావేశంలో మాట్లాడుతున్న జడ్జి బేబీరాణి

శ్రీకాళహస్తి, నవంబరు 26 (ఆంధ్రజ్యోతి): న్యాయం ప్రతి ఒక్కరికి సమానమని శ్రీకాళహస్తి న్యాయస్థాన సీనియర్ సివిల్ జడ్జి బేబీ రాణి అన్నారు. న్యాయ దినోత్సవం, కట్నం నిర్మూలన దినం సందర్భంగా 12వ అదనపు జిల్లా జడ్జి ఆదేశాల మేరకు పట్టణంలోని కోర్టు భవనంలో బుధవారం అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా న్యాయమూర్తి బేబీరాణి మట్లాడుతూ... ఉచిత న్యాయసేవలను అందించడానికి చట్టాలు, న్యాయ సంబంధిత విషయాలపై అవగాహన కల్పించేందుకు, వివాదాలు సామరస్యంగా పరిష్కరించుకోవడానికి లోక్ అదాలత్ నిర్వహిస్తున్నట్లు తెలిపారు. దేశంలో 1960లో వరకట్న నిషేధ చట్టం అమల్లోకి వచ్చిందన్నారు. కట్నం ఇచ్చినా, స్వీకరించినా శిక్షలు ఉంటాయన్నారు. ఉచిత న్యాయ సలహాల కోసం నెం.15100లో సంప్రదించాలని కోరారు. జూనియర్ సివిల్ జడ్జి కృష్ణప్రియ, న్యాయవాదులు, కోర్టు సిబ్బంది, పారా లీగల్ వలంటీర్లు తదితరులు పాల్గొన్నారు.

సీతారాంపేట చెరువును అభివృద్ధి చేయండి

ఎమ్మెల్యేకు గ్రామస్తుల వినతి



రైతుల సమస్యలు తెలుసుకుంటున్న ఎమ్మెల్యే సుధీర్

ఏర్పేడు, నవంబరు 26(ఆంధ్రజ్యోతి): మండలంలోని సీతారాంపేట చెరువు కట్టకు మరమ్మతులు చేపట్టాలని ఎమ్మెల్యే సుధీర్‌ని గ్రామస్తులు కోరారు. రైతన్నా మీకోసం కార్యక్రమంలో భాగంగా బుధవారం ఎమ్మెల్యే సీతారాంపేటలో పర్యటించారు. ఆయన ఇంటింటికి వెళ్లి కూటమి ప్రభుత్వం, సీఎం చంద్రబాబు నాయకత్వంలో రైతులకు అందిస్తున్న సంక్షేమ పథకాలను వివరించారు. సమస్యలను అడిగి తెలుసుకున్నారు. అనంతరం రూ.8.5 లక్షలతో నిర్మించిన సిమెంటు రోడ్డు, మురుగుకాలువను ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో నాయకులు నరసింహులు యాదవ్, శ్రీనివాసులుయాదవ్, మోహన్ నాయుడు, పొన్నారావు, గాలి కృష్ణవేణి, నాగరాజునాయుడు, తహసీల్దారు భార్గవి, ఎంపీడీవో సౌభాగ్యం తదితరులు పాల్గొన్నారు.

● శ్రీకాళహస్తి (ఆంధ్రజ్యోతి): రైతుల సంక్షేమమే కూటమి ప్రభుత్వ ధ్యేయమని ఎమ్మెల్యే సుధీర్ అన్నారు. తొట్టంబేడు మండలం పూడి గ్రామంలో అన్నదాత సుఖీభవ పథకంపై బుధవారం రైతులకు కరపత్రాలను అందజేశారు. టీడీపీ మండల అధ్యక్షుడు రావిళ్ల మునిరాజానాయుడు, శ్రీకాళహస్తి వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ చెంచయ్య నాయుడు, నాయకులు లెక్కలమురళీనాయుడు, శేషం నాయుడు, ప్రభాకర్, మునిరత్నం తదితరులు పాల్గొన్నారు.

తులసికృష్ణాపురంలో రైతన్నా మీకోసం



పిచ్చాటూరు, నవంబరు 26(ఆంధ్రజ్యోతి): మండలంలోని తులసికృష్ణాపురంలో తహసీల్దార్ సుబ్రహ్మణ్యం ఆధ్వర్యంలో రైతన్నా మీ కోసం కార్యక్రమాన్ని వ్యవసాయ అధికారులు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... నీటి భద్రత, డిమాండ్ ఆధారిత పంట, అగ్రిటెక్, ఫుడ్ ప్రాసెసింగ్, ప్రభుత్వం నుంచి పెట్టుబడి సాయం పాటిస్తే రైతు రాజు కావచ్చన్నారు. వ్యవసాయ అధికారి సంజీవరెడ్డి మాట్లాడుతూ పిచ్చాటూరు మన గ్రోమోర్ సెంటర్‌లో యూరియా స్టాక్ వచ్చిందన్నారు. కార్యక్రమంలో వీఆర్‌వో కృష్ణ, స్థానిక నాయకులు సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

బాధితులకు అండగా ఉంటాం




బాధితులతో మాజీ మంత్రి పెద్దిరెడ్డి - బిందెల పంపిణీలో సుందరరామిరెడ్డి తదితరులు

కేవీబీపురం, నవంబరు 26(ఆంధ్రజ్యోతి): మండలంలోని కళత్తూరులో ముంపు బాధితులకు సాధ్యమైనంత వరకు సాయం అందిస్తామని వైసీపీ మాజీ మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి భరోసా ఇచ్చారు. బుధవారం ఆయన తిరుపతి ఎంపీ గురుమూర్తితో కలిసి కళత్తూరులో ముంపునకు గురైన బాధితులను పరామర్శించారు. వైసీపీ అధికారంలోకి వస్తే జగనన్న పక్కా ఇళ్లను నిర్మించి ఇస్తామన్నారు. ఎంపీ గురుమూర్తి మాట్లాడుతూ.. దీన్ని జాతీయ విపత్తుగా గుర్తించడానికి కేంద్ర ప్రభుత్వంతో మాట్లాడుతున్నానని చెప్పారు. అనంతరం కళత్తూరు, పాతపాళెం అరుంధతివాడల్లో కోతకు గురైన, ఇసుక మేట వేసిన పొలాలను పరిశీలించారు. అనంతరం వారు బాధితులందరికీ సీలింగ్‌ఫ్యాన్లను అందించారు. సత్యవేడు నియోజకవర్గ వైపీపీ సమన్వయకర్త రాజేష్, మండల కన్వీనర్ గవర్ల కృష్ణయ్య, మాధవి రెడ్డి, నందకుమార్, సర్పంచ్ గిరిబాబు తదితరులు పాల్గొన్నారు.

● కళత్తూరు గ్రామానికి చెందిన మాజీ వీఆర్వో సుందరరామిరెడ్డి కుమార్తెలు స్వప్న, సంధ్య, సుధ ఆధ్వర్యంలో గ్రామస్తులకు బిందెలు వితరణ చేశారు. కార్యక్రమంలో గోపీనాథరెడ్డి, మల్లికార్జునరెడ్డి, మధుసూదన్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ట్యాంకున్నా నీరు సరఫరా కాదు!



కేవీబీపురం, నవంబరు 26(ఆంధ్రజ్యోతి): మండలంలో రాయలచెరువు ముంపునకు గురైన కళత్తూరుకు సమీపంలోని గోపాలకృష్ణనగర్ వద్ద నిర్మించిన ఓవర్‌హెడ్ ట్యాంకులో నీరు చేరడం లేదు. పైపులు దెబ్బతిన్ని మోటారు దెబ్బతినడంతో ఈ పరిస్థితి తలెత్తింది. అలాగే మురుగునీటి కాలువలు ఉన్నా మట్టి పేరుకుపోయి మురుగు ముందుకు సాగడం లేదు. అధికారులు స్పందించి చర్యలు తీసుకోవాలని గ్రామస్తులు కోరుతున్నారు.

రైతులకు నాణ్యమైన విద్యుత్



రికార్డులను పరిశీలిస్తున్న డీఈ

బుచ్చినాయుడుకండ్రిగ, నవంబరు 26 (ఆంధ్రజ్యోతి):రైతులకు నాణ్యమైన విద్యుత్‌ను అందించాలని ట్రాన్స్‌కో డీఈ చిన్నప్పరెడ్డి ఆదేశించారు. మండల కేంద్రంలోని సబ్‌స్టేషన్‌ను బుధవారం తనిఖీ చేసి సిబ్బందికి పలు సూచనలు చేశారు. విద్యుత్ సరఫరాకు రికార్డులను పరిశీలించి సిబ్బంది పనితీరుపై అసంతృప్తిని వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వం నిర్దేశించిన గడువు లోపు బిల్లులను వసూలు చేయాలన్నారు. బ్రేక్‌డౌన్ లేకుండా చూడాలన్నారు. వ్యవసాయ బోరు మోటారు బిల్లులు, పంచాయతీలకు మోటార్లు, వీధిలైట్ల బిల్లులను సకాలంలో చెల్లించే విధంగా చూడాలన్నారు. సోలర్ విద్యుత్‌పై వినియోగదారులకు అవగాహన కల్పించాలన్నారు.

విద్యాభివృద్ధికి పెద్ద పీట

నారాయణవనం, నవంబర్ 26(ఆంధ్రజ్యోతి): విద్యాభివృద్ధికి ప్రభుత్వం పెద్ద పీట వేస్తున్నదని ఎమ్మెల్యే ఆదిమూలం పేర్కొన్నారు. బుధవారం నారాయణవన జడ్పీ హైస్కూల్ వద్ద సిమెంటు రోడ్డు నిర్మాణానికి రోడ్డుకు భూమి పూజ నిర్వహించారు. జడ్పీటీసీ సభ్యుడు సుమన్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

భారతదేశ ఖ్యాతిని చాటిన పవిత్ర గ్రంథం రాజ్యాంగం





శ్రీకాళహస్తి జడ్పీ బాలుర ఉన్నత పాఠశాలలో, బీఎన్‌కండ్రిగలో పాఠశాలలో రాజ్యాంగ దినోత్సవాలు - సత్యవేడులో అంబేడ్కర్ విగ్రహానికి నివాళులర్పిస్తున్న ఎమ్మెల్యే ఆదిమూలం తదితరులు

శ్రీకాళహస్తి, నవంబరు 26(ఆంధ్రజ్యోతి): శ్రీకాళహస్తి పట్టణంలోని జడ్పీ బాలుర ఉన్నత పాఠశాలలో బుధవారం భారత రాజ్యాంగ దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రధానోపాధ్యాయుడు తీగల వెంకటయ్య మాట్లాడుతూ... అన్ని వర్గాల ప్రజల అభ్యున్నతిని దృష్టిలో పెట్టుకుని రూపకల్పన చేసిన రాజ్యాంగం భారతీయులందరికీ పవిత్రమైందిగా పేర్కొన్నారు. రాజ్యాంగంలోని ఆర్టికల్స్ విశిష్టత గొప్పతనాన్ని ఆయన వివరించారు. ఈ సందర్భంగా విద్యార్థులు, ఉపాధ్యాయులు సంయుక్తగా మాక్ పార్లమెంట్ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు లత, మణి, సుజాత, భానుప్రకాష్, రమేష్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

● తొట్టంబేడు మండలం తంగేళ్లపాళెం మండల పరిషత్ ఆదర్శ పాఠశాలలో బుధవారం 76వ రాజ్యాంగ దినోత్సవాలను నిర్వహించారు. రాజ్యాంగ ముసాయిదా కమిటీ అధ్యక్షుడు డాక్టర్ బీఆర్ అంబేడ్కర్‌కు నివాళులర్పించారు. ఈ సందర్భంగా సర్పంచ్ చెంచుకృష్ణమ నాయుడు మాట్లాడుతూ ప్రపంచంలోని అతిపెద్ద లిఖిత రాజ్యాంగమైన భారత రాజ్యాంగం అందించిన మహానుభావులందరినీ స్మరించుకోవడం బాధ్యత అన్నారు. ఈ కార్యక్రమంలో పీఏసీఎస్ మాజీ చైర్మన్ మోహన్ కిషోర్, ప్రధానోపాధ్యాయులు మురళీకృష్ణ, సుధాకర్, చిట్టిబాబు, మునిరత్నమ్మ తదితరులు పాల్గొన్నారు. ఇక దళిత సంఘాల ఆధ్వర్యంలో పట్టణంలోని అంబేడ్కర్ కూడలి వద్ద కూడా రాజ్యాంగ దినోత్సవాలను నిర్వహించారు. చింతా రాజేంద్ర, సుబ్రహ్మణ్యం, కృష్ణయ్య, పసల రామచంద్రయ్య తదితరులు పాల్గొన్నారు.

బుచ్చినాయుడుకండ్రిగ (ఆంధ్రజ్యోతి): మండలంలోని కల్లివెట్టు, బీఎన్‌కండ్రిగ, విద్యావికాస్ ఉన్నత పాఠశాలల్లో రాజ్యాంగ దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. విద్యార్థులకు భారత రాజ్యాంగంపై వ్యాసరచన పోటీలు నిర్వహించి బహుమతులు అందజేశారు. కాంపాళెం దళితవాడలో అంబేడ్కర్ విగ్రహానికి ఎమ్మెల్యే ఆదిమూలం పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో ఎంఈవో మునిసుబ్రమణ్యం తదితరులు పాల్గొన్నారు.

ఏర్పేడు (ఆంధ్రజ్యోతి): భారతరాజ్యాంగ 76వ వార్షికోత్సవం సందర్భంగా మండలంలోని పెనగడడంలో ఏపీపీటీడీ ఎస్సీ, ఎస్టీ వెల్ఫేర్ అసోసియేషన్ రాష్ట్ర కార్యదర్శి ఏకాంబరం ఆధ్వర్యంలో అంబేడ్కర్ విగ్రహానికి నివాళులర్పించారు. భారతదేశఖ్యాతిని మన రాజ్యాగం చాటిచెప్పిందన్నారు.

సత్యవేడు (ఆంధ్రజ్యోతి): డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ రచించిన రాజ్యాంగం భారతదేశ ప్రజల సమానత్వ, స్వేచ్ఛ సౌభ్రాతృత్వాల ఆకాంక్షలను నెరవేర్చిన మహోన్నత గ్రంథమని ఎమ్మెల్యే ఆదిమూలం అన్నారు. తహసీల్దార్ కార్యాలయ ఆవరణలోని అంబేడ్కర్ విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ భారత రాజ్యాంగాన్ని అందులోని అంశాలను ప్రతి ఒక్కరు అవగాహన చేసుకోవాలని ఆయన కోరారు. వెంకటరమణ, అడ్వకేట్ రాజా, సీనియర్ న్యాయవాది వెంకటేశులు, అంబేడ్కర్ సంఘం నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు. సత్యవేడు ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ప్రిన్సిపాల్ వెంకటరామిరెడ్డి ఆధ్వర్యంలో 76వ జాతీయ రాజ్యాంగ దినోత్సవం ఘనంగా నిర్వహించారు.

నారాయణవనం (ఆంధ్రజ్యోతి): సామాజికంగా అన్నివర్గాల వారిని అభివృద్ధి చెందేలా, అందరికి సమానమైన న్యాయం, చట్టాలు అందేలా రాజ్యాంగ రచన చేసిన అంబేడ్కర్ చిరస్మరణీయుడని ఎమ్మెల్యే ఆదిమూలం అన్నారు. రాజ్యాంగ దినోత్సవం సందర్భంగా బైపాస్‌లో ఉన్న అంబేడ్కర్ విగ్రహానికి పూల మాలలు వేసి నివాళులర్పించారు. ఎంపీడీవో కార్యాలయంలో అంబేడ్కర్ చిత్రపటానికి నివాళులర్పించారు. జడ్పీటీసీ సభ్యుడు సుమన్ కుమార్, దళిత సంఘ నాయకులు, టీడీపీ నాయకులు పాల్గొన్నారు.

నాగలాపురం (ఆంధ్రజ్యోతి): నాగలాపురం ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో జరిగిన కార్యక్రమంలో హెచ్‌ఎం కస్తూరయ్య మాట్లాడు తూ.. రాజ్యాంగాన్ని గౌరవిస్తూ రాజ్యాంగ బద్ధంగా మసులుకుంటూ దేశ సార్వభౌమాధి కారాన్ని కాపాడుకుంటూ ముందుకు సాగాలన్నారు. రాజ్యాంగాన్ని తెలుసుకోవాలని ఎంఈవో బాబయ్య చెప్పారు. పాఠశాల యాజమాన్య కమిటీ సభ్యులు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

పిచ్చాటూరు (ఆంధ్రజ్యోతి): పిచ్చాటూరు ప్రభుత్వ జూనియర్ కళాశాలలో భారత రాజ్యాంగ దినోత్సవాన్ని ఘనంగా జరుపుకున్నారు. మండలంలోని నీరువాయిలో అంబేడ్కర్ విగ్రహానికి పూలమాల వేసి పుష్పాంజలి ఘటించి నివాళులర్పించారు.

లేబర్ కోడ్లను రద్దు చేయండి: సీఐటీయూ




శ్రీకాళహస్తి, సత్యవేడుల్లో సీఐటీయూ నాయకుల నిరసన

శ్రీకాళహస్తి, నవంబరు 26(ఆంధ్రజ్యోతి): కార్మికుల ప్రాథమిక హక్కులను కాలరాసే నాలుగు లేబర్ కోడ్లను రద్దుచేయాలని సీఐటీయూ నాయకులు డిమాండ్ చేశారు. పట్టణంలోని నాలుగు మాడ వీధుల్లో నిరసన ర్యాలీ చేశారు. కార్పొరేట్ల అండదండలతో జీవితకాలం అధికారంలో ఉండాలన్న కాంక్షతో ప్రధాన మంత్రి నరేంద్రమోదీ కార్మిక చట్టాలను సవరిస్తున్నారని సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షుడు అంగే పుల్లయ్య అన్నారు. పెనగడం గురవయ్య, గంధంమణి, వెంకటేష్, వేణు, సంక్రాంతి వెంకటయ్య, అన్వర్ బాషా పాల్గొన్నారు.

సత్యవేడు (ఆంధ్రజ్యోతి): కార్మికుల హక్కులను కాలరాసే విధంగా కేంద్ర ప్రభుత్వం తీసుకొచ్చిన నాలుగు అక్రమ లేబర్ కోడ్లను వెంటనే రద్దు చేయాలని వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి దాసరి జనార్దన్, సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షుడు మెలుగు రమేష్ డిమాండ్ చేశారు. సత్యవేడు తహసీల్దార్ కార్యాలయం ఎదుట నిరసన కార్యక్రమంలో వారు మాట్లాడుతూ లేబర్ కోడ్లను బీజేపీ అనుబంధ సంస్థల సహా కేంద్ర కార్మిక సంఘాలన్నీ వ్యతిరేకిసున్నాయన్నారు. కేవీపీఎస్ నాయకులు అరుణాచలం, యువజన సంఘం నాయకుడు మురళి, మునస్వామి, తిరుమలరెడ్డి, ఏసయ్య, కిష్టయ్య, సుశీలమ్మ, కొల్లాపిరి, శేఖర్ పాల్గొన్నారు.

టీడీపీ నాయకుడికి ఎమ్మెల్యే సుధీర్ పరామర్శ

శ్రీకాళహస్తి, నవంబరు 26(ఆంధ్రజ్యోతి): శ్రీకాళహస్తి పట్టణానికిచెందిన టీడీపీ సీనియర్ నాయకుడు లక్ష్మనేని మధు బాబు తల్లి సావిత్రమ్మ బుధవారం మృతి చెందారు. విషయం తెలుసుకున్న ఎమ్మెల్యే సుధీర్, ఆయన సతీమణి రిషితారెడ్డి పట్టణంలోని వెలంపాళెంకు చేరుకుని మృతదేహానికి నివాళులర్పించారు. ముక్కంటి ఆలయ పాలకమండలి మాజీ చైర్మన్ శ్రీనివాసులు, మార్కెట్ కమిటీ చైర్మన్ చెంచయ్యనాయుడు తదితరులు కూడా నివాళులర్పించారు.

చీరల పంపిణీ



చీరలను పంపిణీ చేస్తున్న మోహన్‌రావు

శ్రీకాళహస్తి, నవంబరు 26(ఆంధ్రజ్యోతి): పట్టణానికి చెందిన ఎస్‌ఎంఆర్ ఫౌండేషన్ చైర్మన్, రైతు సేవా సమితి అధ్యక్షుడు మోహన్‌రావు సతీమణి కడప సుబ్బమ్మ వర్ధంతి సందర్భంగా బుధవారం చీరలు పంపిణీ చేసి అన్నదానం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తన భార్య ఉపాధ్యాయురాలిగా పలువురిని ఉత్తమ విద్యార్థులుగా తీర్చిదిద్దిందన్నారు. పీవీఆర్ గ్రూప్ డైరెక్టర్ జనార్ధనరావు పవార్, ఎస్‌ఎంఆర్ ఫౌండేషన్ సభ్యులు, కుటుంబ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

పురుషులతో సమానంగా మహిళలకు హక్కులు

బుచ్చినాయుడుకండ్రిగ, నవంబరు 26 (ఆంధ్రజ్యోతి): రాజాంగం పురుషులతో సమానంగా మహిళలకు హక్కులు కల్పించిందని, అయినప్పటికీ మహిళలు లింగ వివక్షకు గురవుతున్నారని ఎంపీడీవో వెంకటరత్నమ్మ తెలిపారు. వెలుగు కార్యాలయంలో మండల మహిళ సమాఖ్య కార్యనిర్వాహక సమావేశంలో ఆమె మాట్లాడుతూ... మగవారితో ఆస్తిని సమానంగా పంచాలని, మగ, ఆడ తేడా లేకుండా ఇద్దరిని చదివించాలన్నారు. ఏపీఎం, సీసీలు తదితరులు పాల్గొన్నారు.

ప్రమాదపు అంచుల్లో చెరువుగట్లు



దెబ్బతిన్న వగత్తూరు చెరువు గట్టు

కేవీబీపురం, నవంబరు 26(ఆంధ్రజ్యోతి): మండలంలో పలు చెరువుల గట్లు ప్రమాదకరంగా ఉన్నాయి. మండలంలోని 120 చెరువుల్లో పెద్ద ఆయకట్టు చెరువులు 18 ఉన్నాయి. మొంథా తుపాన్‌తో కురిసిన వర్షాలకు అన్ని చెరువులు నిండుకుండలా ఉన్నాయి. అయితే వీటిలో కొన్ని చెరువుల కట్టలు బలహీనంగా ఉన్నాయి. వగత్తూరు చెరువు బొగడ పడడంతో గమనించిన రైతలు అధికారుల దృష్టికి తీసుకెళ్లి తాత్కాలిక మరమ్మతులు చేశారు. అలాగే కళత్తూరు రిజర్వాయర్ గట్టు కూడా అక్కడక్కడ దెబ్బతినింది. దీంతో పాటు కళత్తూరు పెద్దచెరువు తూర్పు వైపున గట్టు బలహీనపడింది. ఆదరం, ఆదవరం, అంజూరు, మఠం చెరువుల గట్లదీ అదే పరిస్థితి. సంబంధిత అధికారులు, ఆయకట్టు అధ్యక్షులు చెరువు గట్లపై ప్రత్యేక దృష్టి సారించాలని ఆయకట్టు రైతులు కోరుతున్నారు.

బొగడకు మరమ్మతులు



బుచ్చినాయుడకండ్రిగ, నవంబరు 26 (ఆంధ్రజ్యోతి): మండలంలోని కుక్కంబాకం కొత్త చెరువు తూము దగ్గర పడిన బొగడకు నీటి పారుదల శాఖ అధికారులు మరమ్మతులు చేపట్టారు. ఎక్స్‌కవేటర్ సాయంతో కట్టకు మట్టి పోసి పటిష్ఠపరిచారు. బొగడకు ఇసుక బస్తాలు ద్వారా నీటిని బయటకు రాకుండా కట్టడి చేశారు. చెరువుకు శాశ్వతంగా మరమ్మతులు చేపట్టాలని రైతులు కోరుతున్నారు.

దళితులకు ఎమ్మెల్యే పరామర్శ

బుచ్చినాయుడుకండ్రిగ, నవంబరు 26 (ఆంధ్రజ్యోతి): మండలంలోని కాంపాళెం దళితులు అక్రమ కేసులో జైల్లో ఉండి బెయిల్‌పై వచ్చిన గోపి తదితరులను ఎమ్మెల్యే కోనేటి ఆదిమూలం బుధవారం పరామర్శించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పోలీసులు రెండు గ్రామాల మధ్య స్థలం విషయంగా గొడవ జరిగితే దళితులు దాడి చేసినట్లు నాన్‌బెయిలబుల్ కేసులు పెట్టి నెల రోజులు పైన జైల్లో పెట్టించడం దారుణమన్నారు. దళితుల పెట్టిన అట్రాసిటి కేసులో ఇప్పటి వరకు నీర్పాకోటవాసులను అరెస్టు చేయకపోవడం ఏమిటని ప్రశ్నించారు. సీపీఐ మండల కార్యదర్శి కత్తి ధర్మయ్య, ఇతర నాయకులు పాల్గొన్నారు.

రెండు ద్విచక్రవాహనాల ఢీ ఒకరి మృతి



మృతి చెందిన నరేంద్ర

శ్రీకాళహస్తి, నవంబరు 27(ఆంధ్రజ్యోతి): రెండు ద్విచక్ర వాహనాలు ఢీకొన్న ఘటనలో ఓ వ్యక్తి మృతి చెందిన ఘటన తొట్టంబేడు మండలంలో మంగళవారం అర్ధరాత్రి చోటు చేసుకుంది. తొట్టంబేడు పోలీసులు తెలిపిన వివరాలు... శ్రీకాళహస్తి మండలం కమ్మకొత్తూరుకు చెందిన గుడ్లూరు నరేంద్ర సొంతపనుల నిమిత్తం తొట్టంబేడుం మడలం విరూపాక్షి పురం వద్ద వెళ్తుండగా ఎదురుగా వస్తున్న మరో ద్విచక్రవాహనం ఢీకొంది. దీంతో నరేంద్ర తీవ్రంగా గాయపడ్డాడు. స్థానికుల సమాచారంతో పోలీసులు అక్కడికి చేరుకుని క్షతగాత్రుడిని శ్రీకాళహస్తి ఏరియా ఆస్పత్రికి తరలిస్తుండగా మార్గమధ్యంలో మృతి చెందాడు. మృతదేహాన్ని ఏరియా ఆస్పత్రి మార్చురీకి తరలించి పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. పోస్టుమార్టం అనంతరం మృతదేహాన్ని కుటుంబసభ్యులకు అప్పగించారు.

అధ్యాపకులను విధుల్లోకి తీసుకోవాలి

సత్యవేడు, నవంబరు 26(ఆంధ్రజ్యోతి): సత్యవేడు ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో కాంట్రాక్టు ప్రాతిపదికన పని చేస్తున్న అధ్యాపకులు వెంకటేశ్వరులు, ఈశ్వర్‌ను విధుల్లోకి తీసుకోవాలని అంబేడ్కర్ సంఘం నాయకుడు అడ్వకేట్ రాజా కోరారు. బుధవారం కళాశాలకు వెళ్లి ప్రిన్సిపాల్ సుజాతతో మాట్లాడారు. కళాశాలలో 10 ఏళ్లుగా ఉద్యోగాన్ని నమ్ముకున్న వాళ్లను ఒక్కసారిగా విధుల్లో నుంచి తొలగించడం దారుణమన్నారు. అటు ప్రిన్సిపాల్ సుజాత వైఖరి వల్ల విద్యార్థులు కూడా నష్టపోతున్నారని, ఉన్నతాధికారులు స్పందించి కళాశాలలో విచారణ జరిపి చర్యలు తీసుకోవాలని కోరారు. లేని పక్షంలో విద్యార్థుల సంఘాల ఆధ్వర్యంలో ఆందోళన చేపడతామని హెచ్చరించారు.

ఉద్యోగులపై అక్రమ కేసులను ఎత్తివేయాలి ఎన్‌ఎంయూఏ



ఆర్టీసీ డిపో వద్ద ధర్నా నిర్వహిస్తున్న ఎన్‌ఎంయూఏ నాయకులు

సత్యవేడు, నవంబరు 26(ఆంధ్రజ్యోతి): ఆర్టీసీ అధికారులు 1/2019 సర్క్యులర్‌ను తుంగలో తొక్కి ఆర్టీసీ ఉద్యోగులపై పెడుతున్న అక్రమ కేసులను వెంటనే తొలగించాలని నేషనల్ మజ్దూర్ యూనియన్ అసోసియేషన్ (ఎన్‌ఎంయూఏ) సత్యవేడు డిపో అధ్యక్షుడు పార్థసారధి, రాష్ట్ర కార్యదర్శి చెంచులయ్య, సెక్రటరీ బాబు డిమాండ్ చేశారు. రాష్ట్ర కమిటీ పిలుపు మేరకు ఆర్టీసీ డిపో వద్ద ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ జీవోలో లేని అంశాలను అధికారులు ఇష్టారీతిగా ఉద్యోగులపై మోపడం తగదన్నారు. అధికారుల తీరు మారకుంటే ఉద్యమాన్ని తీవ్రతరం చేస్తామన్నారు. డిపో గ్యారేజీ సెక్రటరీ ఎస్.శేఖర్, రీజన్ కమిటీ మెంబరు నరేష్, డిపో కమిటీసభ్యులు గ్యారేజీ కమిటీ సభ్యులు, పలువురు ఉద్యోగులు పాల్గొన్నారు.